# الصراط المستقيم

# ఋజుమార్గం

మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్

٩

يوزع مجاناً ولا يباع

# రుజుమార్గం

మూలం :
మౌలానా హాఫిజ్ ముహమ్మద్ తఖీయుద్దీన్

అనువాదం :
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

తొలి ముద్రణ : అక్టోబరు 1990

రెండవ ముద్రణ : జూన్ 1996

ప్రతులు : 2000

అన్ని హక్కులు ప్రకాశకులవే

వెల : రూ. 9-00

ప్రకాశకులు:
అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్
1174, జామియతుల్ ఖుర్‌ఆన్ కాంపౌండ్,
అక్బర్ బాగ్
హైదరాబాదు - 500 036

ముద్రణ :
ఓం సాయి గ్రాఫిక్స్
నారాయణగూడ, హైదరాబాదు
ఫోన్ : 664141, 633335

# ముందుమాట

కారుణ్య ప్రభువైన అల్లాహ్ తన అంతిమ గ్రంధమయిన ఖుర్‌ఆన్‌ను సకల మానవుల మార్గదర్శకత్వం కొరకు పంపించాడు. అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై అవతరించిన ఈ గ్రంధం చూపే మార్గమే రుజుమార్గం.

పూర్వం గ్రంధవహులైన యూదులు తౌరాత్‌లో మార్పులు చేసి, దాన్ని కుదించి దైవాగ్రహానికి పాత్రులయ్యారు. క్రైస్తవులు బైబిల్‌లో మార్పులు చేర్పులు చేసి దైవ సమ్మతమయిన జీవన సంవిధానం (షరీఅత్) పట్ల అన్యాయం తలపెట్టారు. ఫలితంగా వారు మార్గవిహీనులయ్యారు. దైవ గ్రంధాలలో వారు ఏ ఏ విధాలుగా సవరణలు చేసిందీ ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా తెలియజేయబడింది. కాగా, దేవుని కానుకలకు అర్హులయిన వారెవరో, దైవ ధర్మం పట్ల వారి వైఖరి ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో కూడా ఖుర్‌ఆన్ విశదీకరించింది.

ఖుర్‌ఆన్ ప్రతిపాదించిన రుజుమార్గం సమత్వం సమతూకాలతో కూడినది. ఈ అంశాన్నే ఈ చిరు పుస్తకంలో ప్రధానంగా చర్చించటం జరిగింది. హైదరాబాదులోని పబ్లిక్ గార్డెన్స్ మస్జిద్‌లో ప్రతి ఆదివారం "దర్సె ఖుర్‌ఆన్" పేర జరిగే సమావేశంలో "రుజుమార్గం" శీర్షికపై నేను చేసిన మూడు ప్రసంగాల సారాంశమే ఈ చిరు పుస్తకం.

పరమ ప్రభువైన అల్లాహ్ ఈ చిరు ప్రయత్నాన్ని స్వీకరించాలని, రుజుమార్గాన్వేషణలో ఉన్నవారి కొరకు దీన్ని ప్రయోజనకారి గావించాలని మనసారా వేడుకుంటున్నాను.

దేవా! అందరికీ రుజుమార్గం చూపించు.

- ముహమ్మద్ తఖీయుద్దీన్

# రుజుమార్గం

*"ఇహ్‌దిన స్సిరాతల్ ముస్తఖీమ్. సిరాతల్లజీన అన్ అమ్త అలైహిమ్. గైరిల్ మగ్‌జూబి అలైహిమ్. వ లజ్జాల్లీన్* *(అల్ ఫాతిహ : 5-7)*

"(దేవా!) మాకు రుజుమార్గం చూపు. నీ అనుగ్రహాలకు పాత్రులయినవారి, నీ కోపానికి గురికాని వారి, మార్గభ్రష్టులు కాని వారి మార్గం (చూపించు).

*మహాశయులారా !*

దేవుని అంతిమ గ్రంధమయిన ఖుర్‌ఆన్ సారాంశమంతా దాని మొట్టమొదటి సూర - అల్ ఫాతిహ - లో ఇమిడి ఉందనవచ్చు. ఫాతిహ సూర "ఉమ్ముల్ ఖుర్‌ఆన్" అని ఒక హదీసులో ఉంది. అంటే, ఇది ఖుర్‌ఆన్ మూలం లేదా ఖుర్‌ఆన్‌కు మాతృమూర్తి వంటిదని భావం. ఈ సూర ఎంత సమగ్రమైనదంటే, దాన్ని గనక శోధిస్తే వివరణగా ఖుర్‌ఆన్ సాంతం మన ముందుకు వస్తుంది. ఫాతిహ సూరలో మనిషి, తనకు సన్మార్గం చూపమని తన ప్రభువును మొరపెట్టుకుంటాడు. 'స్వామీ! నీ కానుకలకు అర్హులయినవారి మార్గం నాకు చూపెట్టు, నీ ఆగ్రహానికి గురికానివారి, దారి తప్పకుండా ఉన్న వారి పథంలో నాకు దర్శకత్వం వహించు' అని ఆశగా అర్థిస్తాడు. ఇలాంటి శ్రద్ధా భక్తులతో కూడిన వేడుకోలును పరమ ప్రభువయిన అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. ఆయన కారుణ్య కడలి దాసుని వైపుకు కదలి వస్తుంది.

## కానుకలు పొందినవారెవరు?

దేవుని బహుమానాలు పొందిన వారి ప్రస్తావన పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా చేయబడింది:

"ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత చూపుతారో వారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులయిన వారితో ఉంటారు. అంటే ప్రవక్తలు, సిద్దీఖులు, షహీదులు మరియు సజ్జనులూను."

(అన్ నిసా - 69)

పై వచనాన్ని బట్టి నాలుగు కోవలకు చెందినవారు దైవానుగ్రహాలకు నోచుకున్నారని తెలుస్తోంది. వారే;

1. ప్రవక్తలు
2. సిద్దీఖులు
3. షహీదులు
4. సజ్జనులు

దైవ సమక్షంలో అందరికన్నా ఉన్నత స్థానం ఆయన ప్రవక్తలకు లభిస్తుంది. ఆ తరువాతి స్థానాలు పైన తెలుపబడిన వరుస క్రమంలో ఆ మూడు శ్రేణుల వారికి లభిస్తాయి. చివరి మూడు కోవలకు చెందినవారు కూడా దైవ ప్రవక్తలు చూపిన మార్గంలో నడచి సాఫల్యం పొందుతారు. అంటే, వీరందరి మార్గం ఒక్కటే. అదే రుజుమార్గం (సిరాతల్ ముస్తఖీమ్), అదే సరళ మార్గం. ఈ మార్గం పై నడవటం ద్వారానే దాసుడు తన ప్రభువును చేరుకుంటాడు. గణిత శాస్త్రం ప్రకారం రెండు బిందువులను కలిపే రేఖ - సరళ రేఖ - ఒక్కటే కాగలదు. అది తప్ప ఇతర రేఖలన్నీ వంకరటింకర రేఖలే అవుతాయి. అదే విధంగా ఇస్లామ్ దృష్టిలో దేవుడు - దాసుని మధ్య రుజుమార్గం కేవలం ఒక్కటే. దాన్ని కాదని ఇతర దారుల్లో నడచినవాడు గమ్య

స్థానానికి చేరుకోలేడు. దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది :

1. "ఎవడయినా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లామ్‌ను) కాక మరో మార్గాన్ని అవలంబించదలిస్తే ఆ మార్గం ఎంత మాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు." (ఆలి ఇమ్రాన్ : 85)

2. "అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం కేవలం ఇస్లామ్ మాత్రమే." (ఆలి ఇమ్రాన్ : 19)

3. "ఆయన మీ కొరకు ధర్మంలో, నూహ్ (అలైహిస్సలామ్)కు ఆదేశించిన విధానాన్నే మీ కోసం నిర్ణయించాడు. దాన్నిప్పుడు (ఓ ముహమ్మద్!) మీ వైపుకు వహీ ద్వారా పంపాము. దీని గురించిన ఉపదేశమే మేము ఇబ్రాహీమ్‌కు, మూసా మరియు ఈసాకు ఇచ్చి ఉన్నాము - ఈ ధర్మాన్ని స్థాపించండి, ఇందులో విభేదించుకోకండి అని తాకీదు కూడా చేశాము."

(షూరా : 13)

## దైవ ధర్మం సతతం ఒక్కటే

దైవ ధర్మం అన్ని కాలాల్లోనూ ఒక్కటే. అదే ఇస్లామ్. తరతరాల చరిత్రను తరచి చూసినా, యుగయుగాల జాతుల గాధలను శోధించినా వెల్లడయ్యే సత్యం ఏమిటంటే అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాలలోనూ దైవ ప్రవక్తలు ఆవిర్భవించారు. దైవ విధేయతా విధానాన్ని అవలంబించమని వారు మానవాళికి పిలుపు నిచ్చారు. మరణానంతర జీవితాన్ని గుర్తు చేశారు. స్వర్గ సుఖాల శుభవార్తల్ని అంద జేశారు. నరక యాతన గురించి హెచ్చరించారు. తద్వారా వారు భూగోళంపై నైతిక విప్లవం తెచ్చారు. మనుజ జాతిలోని ఒక

పర్గం ప్రవక్తల సందేశాన్ని ధిక్కరించగా మానవతలోని నవనీతం - సత్య బలమున్న వర్గం - ప్రవక్తల సందేశాన్ని స్వాగతించింది, విధేయతా విధానాన్ని అవలంబించింది. ఆ విధేయతకు నామాంతరమే ఇస్లామ్. దేవుని తరపున ఈ మహత్తర సందేశాన్ని మానవాళికి అందజేసిన ప్రవక్తలలో చిట్టచివరి వారు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). ఆయన (సఅసం) రాకతో, ఆయనగారు అందించిన సందేశంతో దైవ ధర్మం పరిపూర్తి గావించబడింది. అది ఖుర్‌ఆన్ హదీసుల రూపంలో స్పష్టంగా ఉంది. ఈ ఖుర్‌ఆన్ హదీసులే ప్రళయం వరకూ మానవాళికంతటికీ సన్మార్గం చూపుతుంటాయి.

## ఒకే నాణానికి ఇరువైపులు

దివ్య ఖుర్‌ఆన్ దైవ ప్రోక్తమయితే హదీసు ప్రవక్త (స) ప్రవచనం. సిద్ధాంతాలను, సూత్రాలను ప్రతిపాదించేది ఖుర్‌ఆనైతే వాటి తబ్సీళ్ళను మన ముందుంచేదే హదీసు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహా ప్రవక్త (సఅసం) ఒకసారి, ఒక తిన్నని గీత గీసి 'ఇది దైవ మార్గం' అని సెలవిచ్చారు. మరి ఆ తరువాత ఆ గీతకు కుడి వైపున, ఎడమ వైపున మరి కొన్ని గీతలు వేసి "ఇవి (వంకర టింకర) దారులు" అని పలికారు. ఈ దారుల్లో ఒక్కో దాని పై ఒక్కో షైతాన్ పొంచి ఉన్నాడని, వాడు ప్రజలను సన్మార్గం నుంచి తప్పించి తన వైపుకు మరల్చుకుంటాడని హెచ్చరించారు. తరువాత ఆయన (సఅసం) దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను పఠించారు : "వ అన్న హాజా సిరాతీ ముస్తఖీమ.... లఅల్లకుమ్ తత్తఖూన్ (అల్ అన్ ఆమ్ : 153). నా రుజు మార్గం ఇదే. కనుక మీరు దీని పైనే నడవండి. వేరే మార్గాల పై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని, ఆయన మార్గం నుంచి తొలగించి విచ్ఛిన్నపరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే - బహుశా మీరు వక్ర వైఖరికి దూరంగా

ఉంటారనీ, మీకు భయభక్తుల స్పృహ కలుగుతుందనీని."

(ముస్నద్ దారమి)

ఇక మగ్‌జూబ్ (దైవాగ్రహానికి గురయినవారు) ఎవరు, జాల్లీన్ (మార్గభ్రష్టులయినవారు) ఎవరు అనే విషయం కూడా ఖుర్‌ఆన్ మరియు హదీసులలో స్పష్టం చేయబడింది.

"వారు అల్లాహ్ ఆగ్రహానికి పాత్రులయ్యారు."

(అల్ బఖర : 61)

అంటే, ఇస్రాయీల్ వంశీయులైన యూదులు అని భావం.

అలాగే మార్గభ్రష్టులు అనే పదం ఖుర్‌ఆన్‌లో క్రైస్తవులను ఉద్దేశ్యించి పలుకబడింది. ఉదాహరణకు, అల్ మాయిద సూరాలో ఇలా అనబడింది :

అనండి, "గ్రంధవహులారా ! మీ ధర్మంలో అధర్మంగా హద్దులు మీరకండి. మీకు పూర్వం స్వయంగా తామూ మార్గభ్రష్టులై, ఇంకా చాలా మందిని మార్గభ్రష్టులుగా చేసి రుజుమార్గం తప్పినవారి భావనల్ని అనుకరించకండి." (77)

## యూదత్వం, క్రైస్తవాల వాస్తవికత

ఖుర్‌ఆన్ హదీసుల అధ్యయనం వల్ల తెలిసేదేమంటే యూదులు, క్రైస్తవులు ధర్మావలంబనలో మితిమీరిన నిర్లక్ష్యానికి ఒడిగట్టారు. చూడబోతే ప్రభువయిన అల్లాహ్ వారికి గ్రంధం వొసగాడు. ఆకాశ గ్రంధాలైన 'తౌరాత్, ఇంజీల్, బైబిల్'లలో ముహమ్మద్ ప్రవక్త (స) రాక గురించి సూచనలివ్వబడ్డాయి. గ్రంధ జ్ఞానం పొందిన కారణంగా వారు ఏ మాత్రం సంకోచించకుండా ముహమ్మద్ (స)ను అంతిమ దైవ ప్రవక్తగా ధృవీకరించి విశ్వసించాల్సింది. కాని ఆ గ్రంధవహులు తమ వద్ద 'ధార్మిక పరిజ్ఞానం' ఉండీ కూడా-చివరి ప్రవక్త తమ వర్గంలో పుట్టలేదన్న అసూయతో, సంకుచిత భావంతో - సత్యాన్ని

తృణీకరించారు. వారిలో చోటు చేసుకున్న ఈ అహంకారం మూలంగా దేవుడు వారిని మరింత పరధ్యానానికి, ఏమరుపాటుకు లోను చేశాడు. పర్యవసానంగా వారు అపమార్గం నుండి మరలి రాలేకపోయారు

"దైవ గ్రంధం కలవారిలోని పలువురు మిమ్మల్ని ఏదో ఒక విధంగా విశ్వాస మార్గం నుండి మరల్చి మళ్ళీ అవిశ్వాస మార్గం వైపుకు తీసుకుపోదామని కోరుతున్నారు. సత్యం వారికి సుస్పష్టం అయినప్పటికీ వారి ఈ కోరికకు కారణం వారి మనస్సుల్లో ఉన్న అసూయే." (అల్ బఖర: 109)

యూదులు, క్రైస్తవులు దారితప్పిపోవటానికి ఇంకొక కారణమేమంటే వారు మౌలిక విశ్వాసాల (దేవుడు, దైవ గ్రంధాలు, దైవ ప్రవక్తలు, షరీఅత్)లో ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసుకున్నారు. కొన్ని సందర్భాలలో కొత్త విషయాలను చేర్చుకున్నారు. మరి కొన్ని సందర్భాలలో ఉన్న విషయాలను రద్దు చేసుకున్నారు. అంతటితో ఆగలేదు. దేవుని ఔన్నత్యం పట్లనే అవమానకరమయిన మాటల్ని పలికి దైవాగ్రహానికి పాత్రులయ్యారు. ఉదాహరణకు దివ్య ఖుర్ఆన్‌లోని క్రింది వచనం ద్వారా వారెంతగా బరితెగించి వ్యవహరించారో అర్ధమవుతుంది.

"అల్లాహ్ పేదవాడు మేము సంపన్నులం అని ఎవరు పలికారో వారి వాక్కును అల్లాహ్ విన్నాడు."

(ఆలి ఇమ్రాన్ : 181)

"ఎవరైతే అల్లాహ్ ఆదేశాలను, బోధనలను శిరసావహించటానికి నిరాకరిస్తారో, ఆయన ప్రవక్తల్ని అన్యాయంగా చంపుతారో, న్యాయాన్ని సత్యాన్ని ఆదేశించటానికి మానవుల్లో నుండి లేచే ప్రజల ప్రాణాల వెంటపడతారో వారికి బాధాకరమైన శిక్ష యొక్క శుభవార్త వినిపించు" (ఆలి ఇమ్రాన్ : 21)

వారు షరీఅత్ ప్రకారం నడిచే బదులు షరీఅత్‌ను తమ మనోవాంఛలకనుగుణంగా చేసుకున్నారు. దేవుడు సమ్మతించి ఆమోదించిన షరీఅత్ (జీవన విధానం)లో కొంత భాగాన్ని పాటించి మరికొంత భాగాన్ని వదిలేశారు. ఆ విధంగా యూదులు షరీఅత్‌ను కుదించివేయగా, క్రైస్తవ సోదరులు దీనికి భిన్నంగా షరీఅత్‌ను సాగదీశారు. ఉదాహరణకు, దైవ ప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు)ను 'ఇబ్నుల్లాహ్' (దేవుని కుమారుడు) అని పిలిచారు. అంతటితో ఆగకుండా ఏసే 'అసలు దేవుడు' అని కూడా నిర్ధారించుకున్నారు. ధర్మంలో అతివాదానికి పోయి లేనిపోని కష్టాలను కొని తెచ్చుకున్నారు. వారు అవలంబించే సన్యాసత్వం దీనికి ఒక తార్కాణం.

> "... ఇంకా సన్యాసత్వాన్ని వారే స్వయంగా సృష్టించుకున్నారు. అంతేగాని మేము దాన్ని వారిపై విధిగా చేయలేదు. అయితే దైవ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో తమంతట తామే ఈ కొత్త పోకడను సృష్టించారు. మరి దాన్ని పాటించవలసిన విధంగా పాటించనూలేకపోయారు." (అల్ హదీద్ : 27)

యూదుల వద్ద 'జ్ఞానం' మెండుగానే ఉండేది. కాని వారిలో ఆచరణ లోపించింది. దీనికి భిన్నంగా క్రైస్తవులలో ఆచరణ పుష్కలంగా ఉండేదిగాని వారు 'జ్ఞానాన్ని' పట్టించుకునేవారు కారు. తత్కారణంగా వారు మార్గవిహీనతకు లోనయ్యారు.

కాగా, నిజ జ్ఞానం పొంది సదాచరణ చేయటమే రుజుమార్గం. అంటే, దైవ సమ్మతమైన ధర్మంలో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకూడదు. జీవితంలోని ఏ రంగంలోనైనా షరీఅత్ ప్రకారమే వ్యవహరించాలి.

అందుకే - ప్రతి రోజూ నమాజ్‌లో అనేక సార్లు పఠించబడే ఫాతిహ సూరలో - అనుగ్రహం పొందినవారి అడుగుజాడల్లోనే నడవమని, యూదుల,

నసరానీల మార్గం నుండి శరణు వేడమని తాకీదు చేయబడింది. నేటికీ ఎవరయినా దైవధర్మమైన ఇస్లామ్‌లో హెచ్చుతగ్గులు, మార్పులు చేర్పులు చేయడానికి యత్నిస్తే అలాంటి వారంతా దైవ శాపగ్రస్తుల, మార్గభ్రష్టుల పంచన చేరినట్లే లెక్క. కనుక ముస్లిమయిన ప్రతి ఒక్కడూ రుజుమార్గం యొక్క ఈ వాస్తవికతను జీవితాంతం దృష్టిలో ఉంచుకోవాలి.

పవిత్ర ఖుర్‌ఆన్‌లోని క్రింది వచనాలలో రుజు మార్గం ఏదో స్పష్టీకరించటం జరిగింది

1. "కనుక, 'వహీ' ద్వారా మీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని గట్టిగా పట్టుకుని ఉండండి. నిశ్చయంగా మీరు రుజుమార్గంపై ఉన్నారు." (అజ్జుఖ్‌రుఫ్ : 43)

పై వచనంలో 'వహీ'ని అంటే, దివ్యఖుర్‌ఆన్‌ను రుజుమార్గంగా పేర్కొనటం జరిగింది.

2. "యాసీన్, ఖుర్‌ఆనె హకీమ్ సాక్షిగా! (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా మీరు సందేశహరులలోనివారు, (మీరు) సన్మార్గాన ఉన్నారు. (మరియు ఈ ఖుర్‌ఆన్) శక్తిమంతుడు మరియు కృపాకరుని తరఫున అవతరింపజేయబడింది."

(యాసీన్ : 1-5)

పై వచనాల ద్వారా బోధపడేదేమంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ మరియు ఖుర్‌ఆన్‌ల అనుసరణే రుజుమార్గం. ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదివిన ప్రతి వ్యక్తీ మహాప్రవక్త (సఅసం) క్రియాత్మక జీవితం ఖుర్‌ఆన్ ప్రబోధనలకు అద్దం పడుతుందన్న సత్యాన్ని గ్రహిస్తాడు.

దైవ ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) అవలంబించిన మార్గం కూడా పూర్తిగా ఏకేశ్వర వాదంతో కూడినదే. ఇబ్రాహీం యూదుడూ కాదు, నస్రానీ

కాదు - ఆయనయితే నికార్సయిన ముస్లిమ్. ఆ విషయాన్నే ఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది :

3. "ఇబ్రాహీమ్ యూదుడూ కాదు, క్రైస్తవుడూ కాదు. ఆయన దీక్షాపరుడయిన ముస్లిమ్. ఆయన ఎంత మాత్రం ముష్రిక్‌లలోని వాడు కాదు." (ఆలి ఇమ్రాన్ : 67)

దీన్ని బట్టి ఇబ్రాహీమ్ అనుచర వర్గం ఏకేశ్వర వాదంతో కూడినదనీ, దాన్నే రుజుమార్గంగా ఖుర్‌ఆన్ నిర్ధారించిందని తెలుస్తోంది.

4. "ఓ అపరాధులారా! ఈ రోజు మీరు వేరైపొండి. ఆదమ్ బిడ్డలారా! షైతాన్ దాస్యం చేయరాదని, వాడు మీ పాలిట బహిరంగ శత్రువనీ మరియు నన్నే సేవించమనీ, ఇదే రుజుమార్గమని నేను మీకు ఉపదేశించలేదా?"

(యాసీన్: 59-61)

పై ఆయత్‌లో పరమ ప్రభువైన అల్లాహ్ తన రుజుమార్గానికి ఎదురుగా ఉన్న షైతాన్ మార్గాన్ని కూడా ప్రస్తావించి "రుజు మార్గమయితే అల్లాహ్‌దే"నని, అదే స్వర్గానికి రాచబాట అని తెలియజేశాడు. దీనికి ప్రతిగా ఉన్నదే షైతాన్ మార్గం. అది దేవుని ఆగ్రహానికి మూలమై మనిషిని నరకానికి గొనిపోతుంది ఆదమ్ సంతానానికి బహిరంగ శత్రువయిన షైతాన్ అడుగులకు మడుగులొత్తరాదని అల్లాహ్ తన గ్రంథం ద్వారా ముందే అప్రమత్తుల్ని చేశాడు. కాని శోచనీయమయిన విషయం ఏమిటంటే నేడు మానవాళిలో అధికులు షైతాన్ మార్గాన్నే ఎన్నుకుని దైవాగ్రహానికి గురవుతూ నరక వాసానికి బాటలు వేసుకుంటున్నారు. షైతాన్ సయితం మానవతలో చాలా మంది తన అనుయాయులే అవుతారని ఊహించాడు.

5. "ఆలోచించండి! తలక్రిందులై ముఖాన్ని నేలకు ఆనించి

నడిచే వ్యక్తి ఎక్కువ సన్మార్గం పొందుతాడా లేక తల లేపి తిన్నగా - చక్కని రహదారిపై పోయే వ్యక్తి సన్మార్గం పొందుతాడా?'

(అల్ ముల్క్ : 22)

తలక్రిందులై ముఖం ఆధారంగా నడిచే వ్యక్తికి బదులు తిన్నని మార్గం పై తిన్నగా నడిచిపొయ్యే వ్యక్తే రుజుమార్గంపై ఉన్నాడని పై వచనం ద్వారా స్పష్టమవుతోంది. రుజుమార్గం అంటే ఇస్లామ్ మరియు దాని వెలుగు అని భావం. తద్భిన్నంగా ఉన్నవన్నీ అపమార్గాలే, ఎగుళ్ళు దిగుళ్ళతో కూడిన కాలిబాటలే. పైగా అవన్నీ చీకటిమయమైనవి. కాబట్టి ఖుర్ఆన్ మరియు దాని వెలుగు ద్వారా ప్రయోజనం పొందనివాని దృష్టాంతం, తలక్రిందులై చీకట్లో దారిని వెతుక్కునే వాడిలాంటిదే. అటువంటి అవివేకి ఎన్నటికీ గమ్యం చేరలేడు.

6. "(ఓ ప్రవక్తా!) మేము మీకు స్పష్టమయిన విజయాన్ని ప్రసాదించాము - అల్లాహ్ మీ మునుపటి, వెనుకటి పొరపాట్లను మన్నించటానికి, మీపై తన కరుణానుగ్రహాన్ని పరిపూర్తిగావించడానికీ, మరియు మీకు రుజు మార్గం చూపటానికీని," (అల్ ఫతహ్ : 1,2)

పై ఆయత్‌లను బట్టి అంతిమ దైవ ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (సఅసం)కు కూడా రుజు మార్గం అల్లాహ్ తరపునే చూపబడిందని స్పష్టమవుతోంది.

7. "తద్వారా ఇది విశ్వాసుల కొరకు ఒక నిదర్శనం కావటానికి మరియు అల్లాహ్ మీకు సన్మార్గం చూపటానికీని."

(అల్ ఫతహ్ : 20)

మహా ప్రవక్త (సఅసం) అనుచర వర్గానికి సయితం రుజుమార్గం లభించేది అల్లాహ్ తరపునేనని పై ఆయత్‌లో వివరించబడింది.

8. ఇంకా ఈసా - ఏసుక్రీస్తు - పలికారు : "అల్లాహ్ నాకూ ప్రభువే. మీకూ ప్రభువే. కనుక మీరు ఆయన్నే సేవించండి. ఇదే రుజుమార్గం." (మర్యమ్ : 36)

చూశారా! పై వచనంలో దైవప్రవక్త అయిన ఈసా అలైహిస్సలామ్ (ఏసుక్రీస్తు) దైవత్వం విషయంలో యదార్థాన్ని ఎంతో నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తాను దైవం కానని, దైవ దాసుణ్ణి మాత్రమేనని తన అనుచర గణానికి స్పష్టం చేశారు. మీకు, నాకు - అందరికీ ప్రభువయిన అల్లాహ్‌నే ఆరాధించండని కోరారు. దీని ద్వారా విదితమయ్యేదేమిటంటే ప్రవక్త ఈసా (ఏసు క్రీస్తు) బహు దైవోపాసనకు ప్రతిగా రుజుమార్గం వైపుకు - దేవుని ఏకత్వం వైపుకు - మానవాళిని పిలిచారు. కాబట్టి ఏకేశ్వరోపాసనే సిసలయిన రుజుమార్గం. రుజుమార్గం ఏదంటే అది స్వచ్ఛమయిన ఏకేశ్వరోపాసనే. నిజానికి క్రైస్తవ ధర్మం కూడా ఇదే ప్రబోధించింది.

## షైతాన్, రుజుమార్గం మరియు సజ్జనులు

"వీళ్ళంతా లేపబడే రోజు వరకూ నాకు వ్యవధి ఇవ్వు" - అడిగాడు షైతాన్.

"నీకు వ్యవధి ఉంటుంది" - అన్నాడు అల్లాహ్.

"అలాగే, ఏ విధంగానయితే నువ్వు నన్ను మార్గభ్రష్టత్వానికి గురిచేశావో, నేను కూడా నీ రుజు మార్గంపై ఈ మానవుల కోసం పొంచి కూర్చుంటాను. వెనుకా, ముందూ, కుడీ, ఎడమా - అన్ని వైపుల నుండీ వారిని చుట్టుముడతాను. వారిలో అధికుల్ని నీవు కృతజ్ఞులుగా చూడవు."

(అల్ ఆరాఫ్ : 16, 17)

ఆది మానవుడయిన ఆదమ్ (అలైహిస్సలామ్) భూమి పైకి

పంపబడినప్పుడు, దేవుడు ఆదమ్‌కు ఒక స్పష్టమయిన సూచన ఇచ్చాడు. 'షైతాన్ నీ పాలిట బహిరంగ శత్రువు. అతని విషయంలో నువ్వు అప్రమత్తంగా ఉండు. నేను అవసరాన్ని బట్టి నీ సంతతి మార్గదర్శకత్వం కోసం ప్రవక్తల్ని పంపిస్తూ ఉంటాను. వారిని విశ్వసించి, అనుసరించినవారికి ఎన్నటికీ భీతి ఉండదు. దుఃఖం ఉండదు' అని సృష్టికర్త ఆదమ్‌కు ఉపదేశించాడు.

షైతాన్ అల్లాహ్ వద్ద 'వ్యవధి' అడిగిన సందర్భం ఖుర్‌ఆన్‌లో వేరొక చోట ఇలా ప్రస్తావించబడింది :

> అతడు విన్నవించుకున్నాడు, 'నా ప్రభూ! విషయం ఇదైతే, మానవులంతా మళ్ళీ లేపబడే రోజు వరకు నాకు వ్యవధి ఇవ్వు. సెలవిచ్చాడు, "మంచిది. ఆ దినం వరకు నీకు వ్యవధి ఉంటుంది - ఏ దినం యొక్క సమయమయితే మాకు తెలుసో." (అల్ హిజ్ర్: 36-38)

ఒక విషయాన్ని నువ్వు నిర్ణయించుకున్నావు. ఒక విషయాన్ని నేను నిర్ణయించుకున్నాను. అదేమిటంటే, ప్రజలను అపమార్గం పట్టించేందుకు నీకు స్వేచ్ఛ ఇవ్వబడింది. అయితే నిన్నూ, నీ అడుగుజాడల్లో నడిచేవాళ్ళనూ నేను నరకంలో పడవేస్తాను అని అల్లాహ్ సెలవిచ్చాడు.

ఆదమ్ సంతతితో షైతాన్ సాగించే ఈ చతుర్ముఖ పోరాటం ఎంత భీకరమయిందో, ఇటువంటి బహిరంగ శత్రువు నుండి సురక్షితంగా ఉండటానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందో ఊహించవచ్చు. అడుగడుగునా షైతాన్ మాటేసి ఉన్నాడు. అందుకే నమాజ్ చేసేటప్పుడు ప్రతి రకాత్‌లోనూ 'రుజుమార్గం చూపు ప్రభూ!' అని అర్థిస్తాము.

## దైవానుగ్రహం పొందిన వారి మార్గమే రుజుమార్గం

రుజుమార్గాన పయనించేవారిలో సజ్జనులు - దేవుని నిర్ణీత దాసులు మాత్రమే షైతాన్ వ్యూహంలో చిక్కుకోకుండా, సురక్షితంగా ఉండగలుగుతారు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ షైతాన్‌ను ఉద్దేశించి ఇలా సెలవిచ్చాడు :

> "నిస్సందేహంగా ఎవరయితే నా నిజమయిన దాసులో వారి పై నీ అధికారం సాగదు. నీ అధికారమైతే కేవలం ఆ భ్రష్టులయిన వారిపై మాత్రమే సాగుతుంది ఎవరైతే నిన్ను అనుసరిస్తారో. వీరందరి కొరకు నరక శాపం ఉంది."
>
> (అల్ హిజ్ర్: 42, 43)

రుజుమార్గాన నడుస్తూ నలువైపులనుంచీ షైతాన్ జరిపే దాడులను తిప్పికొడుతూ ముందుకు సాగిపోయే వారే తన నిజమయిన దాసులని అల్లాహ్ పేర్కొనడం గమనార్హం. అందుచేత షైతాన్ దారిలో పోయే వారు యదార్థానికి దైవదాసులని అనిపించుకోరు - వారు షైతాన్ బానిసలే. యాసీన్ సూరాలో ఆ విషయమే ఇలా చెప్పబడింది:

> "ఆదమ్ బిడ్డలారా! షైతాన్ ఊడిగం చెయ్యవద్దని, వాడు మీ బహిరంగ శత్రువనీ, కేవలం నన్నే ఆరాధించమనీ, ఇదే అసలు రుజుమార్గమని నేను మీకు ఉపదేశించలేదా?"
>
> (యాసీన్ : 60, 61)

### ఇబాదత్ అంటే...

పై వచనం ద్వారా స్పష్టమయ్యేదేమంటే, మానవుడు 'దాస్యం' అంటూ చేస్తే కేవలం తనను సృష్టించిన గొప్పవానికే చేయాలి. ఆయన చూపిన విధానంపై - సిరాతె ముస్తఖీమ్ పై - నే నడవాలి. అదే సిసలయిన దాస్యం. అదే సాఫల్య మార్గం. అలా గాకుండా షైతాన్ ప్రేరణలకు, వాడి

కవ్వింపులకు,లాలింపులకు, బుజ్జగింపులకు లొంగిపోయి, వాడి అడుగులకు మడుగులొత్తితే అది షైతాన్ దాస్యమే అవుతుంది.

షైతాన్ క్యారెక్టర్ దృష్ట్యాను, అతని దాస్యం చేయరాదన్న ఖుర్‌ఆన్ ప్రబోధన రీత్యాను స్వతహాగా ప్రజలు షైతాన్‌ను అసహ్యించుకుంటారు. కాని విచిత్రం, విచారకరం ఏమిటంటే షైతాన్‌ను అసహ్యించుకుంటూనే వాడి పాద చిహ్నాలను అనుసరిస్తారు. అంటే వారు తెలిసి కూడా తమను తాము అపరాధులుగా, దైవాగ్రహానికి పాత్రులుగా నిలబెట్టుకుంటున్నారు. మనిషి షైతాన్ ప్రేరణలకు లొంగిపోయి మనోవాంఛల పరిపూర్తిలోనే అనునిత్యం గడుపుతూ కూడా తాను సన్మార్గంలోనే ఉన్నానని భావిస్తే అది ఆత్మ వంచనే అవుతుంది.

## షరీఅత్ - రుజుమార్గం

రుజుమార్గం షరీఅత్‌కు, దాని స్ఫూర్తికి ప్రతిబింబంగాని ద్వితీయ శ్రేణి అంశాలకు కాదు. ఉద్గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు :

> "పూర్వం ఏ ఖిబ్లా వైపుకు తిరిగి వీరు నమాజ్ చేసేవారో, దాని నుండి ఇంత అకస్మాత్తుగా మరలటానికి కారణం ఏమిటి?" అని మూర్ఖ జనులు అంటారు. ప్రవక్తా! వారితో అనండి, "ప్రాక్పశ్చిమాలన్నీ అల్లాహ్‌వే. అల్లాహ్ తాను కోరినవారికి రుజుమార్గం చూపుతాడు." (అల్ బఖర : 142)

పై వచనంలో ఖిబ్లా (దిశ) మార్పు గురించిన ప్రస్తావన ఉంది. అంతిమ దైవ సందేశహరుడైన ముహమ్మద్ (సఅసం) మదీనాకు వలసవెళ్ళిన తరువాత, దాదాపు 17 నెలల వరకూ బైతుల్ మఖ్దిస్ (జెరూసలేము) వైపుకే తిరిగి దైవారాధన చేసేవారు. అయితే 'కాబా' వైపుకు అభిముఖమై నమాజ్

చేయవలసిందిగా దేవుడు తనకు ఆజ్ఞాపిస్తే బావుండేదని మహాప్రవక్త (సఅసం) మనసులో అనుకునేవారు. దేవుడు తన ప్రవక్త మనోభీష్టాన్ని తెలుసుకున్నాడు. అందుకే 'కాబా' వైపుకు తిరిగి నమాజ్ చేసుకోవటానికి అనుమతిస్తూ అల్లాహ్ క్రింది ఆయత్‌ను అవతరింపజేశాడు :

> "ప్రవక్తా! నీవు మాటిమాటికీ ముఖాన్ని ఆకాశం వైపుకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమయిన ఖిబ్లా వైపుకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపుకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నాసరే. ముఖాన్ని ఆ వైపుకే పెట్టి నమాజ్ చెయ్యండి." (అల్ బఖర : 144)

ఈ ప్రకటన వెలువడగానే సంకుచిత మనస్కులయిన యూదులు మదీనాలో దుష్ప్రచారానికి పూనుకున్నారు. ఈ ప్రవక్తే గనక సత్యవంతుడయితే, ఈయన బోధించే ధర్మమే సత్యమయినదయితే 'దిశ'ను మార్చవలసిన అవసరం ఏమొచ్చింది అంటూ సందేహం లేవనెత్తారు. వారి శంకలకు పై ఆయత్‌లో సమాధానమిస్తూ అసలు విషయం నిష్కల్మష విశ్వాసంతో చేసే ఆరాధనేగాని, 'దిశ' కాదని స్పష్టం చేయటం జరిగింది. 'కిబ్లా'ను మార్చుకోవలసిందిగా దైవ సంకేతం అందగానే - నమాజ్ చేస్తున్న స్థితిలోనే - దైవాజ్ఞను శిరసావహిస్తూ మహా ప్రవక్త కాబా వైపుకు అభిముఖమయ్యారు. ప్రియ సహచరులు కూడా తమ సారథిని అనుసరించారు. దైవ విధేయతా భావాన్ని ఆకళింపు చేసుకుని, షరీఅత్ బోధనల నుండి సరయిన స్ఫూర్తిని పొంది తదనుగుణంగా ఆచరించటమే నిజానికి రుజుమార్గం. మిగిలిన అంశాలన్నీ ద్వితీయ శ్రేణికి చెందినవి, పాక్షికమైనవి లేదా సాపేక్షికమైనవి. ఇలాంటి స్వల్ప విషయాల్లో పడిపోయి వితండ వాదనకు దిగితే ధర్మం యొక్క సారాన్ని గ్రహించటంలో బుద్ధి

తికమకపడే ప్రమాదముంది. గ్రంథ జ్ఞానం గల యూదులు అందరికన్నా ముందే అంతిమ దైవప్రవక్తను, అంతిమ దైవ గ్రంధాన్ని (ఖుర్ఆన్‌ను) విశ్వసించాల్సింది. కాని పాక్షిక విషయాల్లో కూరుకుపోయిన కారణంగా అందరికన్నా ముందు యూదులే అవిశ్వాసుల జాబితాలో చేరారు. యూదులనుద్దేశించి ఖుర్ఆన్‌లో సెలవీయబడింది :

"ఇదివరకే మా వద్దనున్న దైవగ్రంధాన్ని అది ధృవీకరిస్తుంది. కనుక మీరే అందరికంటే ముందు దాన్ని తిరస్కరించేవారు అవకండి." (అల్ బఖర : 41)

కాని, ఈ యూదులే 'ఖిబ్లా' మార్పుపై ప్రజల్లో లేని పోని సందేహాలు సృష్టించారు. సమాధానంగా అల్లాహ్ ఏమన్నాడంటే ;

"ఎవరు ప్రవక్తను అనుసరిస్తారో, ఎవరు వెనుతిరిగిపోతారో పరీక్షించాలనే మేము మీ పూర్వపు ఖిబ్లాను - దేని వైపుకు మీరు మీ ముఖాన్ని త్రిప్పేవారో - నిర్ణయించాము. ఇది నిజంగా ఎంతో కఠినమయిన విషయం. కాని అల్లాహ్ ఎవరికి సన్మార్గ భాగ్యం కలుగజేశాడో, వారికి ఇది ఏ మాత్రం కష్టతరం కాలేదు. " (అల్ బఖర : 143)

సన్మార్గం కేవలం 'తూర్పు-పడమర'లతో మాత్రమే ముడివడి లేదని అంతకన్నా అది దైవ ప్రీతిని పొందటం, దైవాజ్ఞల్ని పాలించటంలోనే ఇమిడి ఉందని పై వచనం ద్వారా అవగతమవుతుంది. అలాగే, దేవుడు సన్మార్గం పై నడిచే భాగ్యం కలుగజేసినవారల్లా, 'ఖిబ్లా' మారిందని తెలియగానే తదనుగుణంగా ఆచరించసాగారు. కనుక వారు ఇదివరకు కూడా సన్మార్గంలోనే ఉన్నారు, ఇప్పటికీ సన్మార్గాన్నే నడుస్తున్నారు. అయితే షరీఅత్ బోధనలపై దాని స్ఫూర్తిపై అవగాహన లేని వారు హృదయ కాపట్యానికి లోనయ్యారు. ఆ కాపట్య రోగం

మూలంగా వారిలో సంకుచితత్వం మరింత అధికమయింది. వారి దృష్టి ఎల్లప్పుడూ షరీఅత్ స్వభావంపై గాకుండా పాక్షిక విషయాలపైనే నిలిచి ఉండేది. ఆ విధంగా వారు దారి తప్పారు.

విచారకరమైన విషయం ఏమిటంటే ముస్లిమ్ సమాజంలో ఇప్పటికీ అనేక మంది ప్రాముఖ్యతలేని అంశాలను, పాక్షిక విషయాలను పట్టుకుని అనవసరంగా కాలాన్ని వృథాచేస్తూ దైవ ప్రసాదితమయిన తెలివితేటలను శక్తియుక్తులను దుర్వినియోగం చేస్తున్నారు.

పై ఆధారాల ద్వారా అర్థమయ్యేదేమిటంటే, ఖుర్ఆన్ కనుగుణంగా ఆచరించటం, దైవం మరియు దైవ ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉండటం యొక్క మారుపేరే రుజుమార్గం. క్రింది దైవ వచనం ద్వారా ఈ యదార్థం మరింత తేటతెల్లమవుతుంది :

> "సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను, తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, దూతల్ని, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తల్ని హృదయ పూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ ప్రేమలో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకు, అనాధల కొరకు, నిరుపేదల కొరకు, బాటసారుల కొరకు సహాయం చెయ్యమని అర్థించే వారి కొరకు, ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం, ఇంకా నమాజ్‌ను స్థాపించటం, జకాత్ ఇవ్వటం. వాగ్దానం చేస్తే దాన్ని పాటించేవారు, కష్టకాలంలో, లేమిలో, సత్యానికి-అసత్యానికి మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపే వారు సత్పురుషులు, వాస్తవంలో సత్యసంధులు, అల్లాహ్ యెడల భయభక్తులు

కలవారు వీరే." (అల్ బఖర : 177)

## రుజుమార్గంలో నవ నిర్దేశాలు

దివ్య ఖుర్ఆన్‌లోని అల్ అన్ఆమ్ సూరాలో రుజుమార్గం ఏదో తెలిపే మూడు సమగ్రమైన ఆయత్‌లు ఉన్నాయి:

ఓ ప్రవక్తా! వారికి చెప్పండి, "రండి, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏమిటో వినిపిస్తాను. ఆయనకు ఎవరినీ భాగస్వాములుగా చేయరాదు; తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి; లేమికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి, మేము మీకూ ఉపాధినిస్తున్నాము, వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి - అవి బహిరంగమైనవైనా సరే లేక రహస్యమైనవైనా సరె. సత్యం కొరకు తప్ప అల్లాహ్ పవిత్రంగా పరిగణించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి. ఈ విషయాలనే ఆయన మీకు బోధించాడు, బహుశా మీరు అర్థం చేసుకుని వ్యవహరిస్తారని. అనాథల ఆస్తి దరిదాపులకు పోకండి, వారు యుక్త వయస్సుకు చేరేవరకు, ఉత్తమమయిన పంథాలో తప్ప. కొలతలో, తూనికలో పూర్తి న్యాయంతో వ్యవహరించండి. మేము ప్రతి మనిషిపైనా అతని శక్తి మేరకే బాధ్యతా భారాన్ని మోపుతాము; పలికితే న్యాయమే పలకండి - వ్యవహారం మీ బంధువులకు సంబంధించినదయినా సరే. అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. ఈ మాటల్ని అల్లాహ్ మీకు ఉపదేశించాడు - బహుశా మీరు హితబోధను స్వీకరిస్తారేమోనని. ఇంకా ఆయన ఉద్బోధ ఇది : నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే

మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్ఛిన్నపరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం ఇదే - బహుశా మీరు వక్ర వైఖరికి దూరంగా ఉంటారని, మీకు భయభక్తుల స్పృహ కలుగుతుందని." (అల్ అన్ ఆమ్ : 151-153)

పై ఆయత్‌లో సృష్టికర్త తన దాసులకు తొమ్మిది ఆజ్ఞల్ని ఇచ్చి 'నా రుజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి' అని ఉపదేశించాడు. కాబట్టి రుజుమార్గంపై నడవాలంటే పైన పేర్కొనబడిన తొమ్మిది దైవాజ్ఞల్ని శిరసావహించటం అనివార్యం. బహుశా ఈ కారణంగానే అల్లాహ్, "ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ్" అనే ప్రార్ధనను తన దాసునికి నేర్పాడు. ఈ 9 ఆదేశాల గురించి మనిషి తరచూ ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి. ఈ ఆదేశాల పాలనలో షైతాన్ ఒక ప్రమాదకరమయిన "ముల్లు"గా ఉన్నాడు. ఎలాగయినా సరే మనుషులను రుజుమార్గంలో వెళ్ళకుండా చెయ్యాలన్న కృతనిశ్చయంతో మాటేసి కూర్చున్నాడు. అందుకే మానవుడు రుజుమార్గం అర్థించడంతోపాటు షైతాన్ కలిగించే కీడుల నుంచి కూడా తనను సురక్షితంగా ఉంచమని దైవాన్ని వేడుకోవాలి. ఎందుచేతనంటే దేవుని తరపు నుంచి సన్మార్గ భాగ్యం, సద్బుద్ధి లభించే దాకా ఏ మనిషీ ఆతనెంత మూర్తిమంతుడయినా సరే - సన్మార్గం పైకి రాలేడు. ఈ తొమ్మిది దైవాజ్ఞలు జీవితపు అన్ని రంగాలతోనూ ముడిపడి ఉంటాయి. వాటిని ఖచ్చితంగా పాటించగలిగితే మనిషి తన యావత్తు జీవితాన్ని ఇస్లామీయ చట్రంలో ఇమిడ్చినట్లే.

## రుజుమార్గంలో మొదటి నిబంధన :

'షిర్క్'కు దూరంగా ఉండాలన్నది రుజుమార్గంలో మొదటి షరతు. 'షిర్క్'కు దూరంగా ఉండటమంటే భావం ఏమిటి? దైవత్వం అల్లాహ్‌కే

స్వంతం. అందులో ఎవరికీ భాగస్వామ్యం కల్పించరాదు. దేవుని గుణగణాలలోగాని, ఆయన అధికారాలలో గాని, ఆయన హక్కులలో గానీ ఇంకొకరిని - వారు సజీవులయినా లేక నిర్జీవులయినా - సహవర్తులుగా నిలబెట్టకూడదు. దీనికి బదులు ఎవరయినా ఒకరికన్నా ఎక్కువ మంది దేవుళ్ళు ఉన్నారని అంటే, అల్లాహ్ గాకుండా తమకు ఉపాధినొసగే వారు, పోషించేవారు, జీవన్మరణాలనిచ్చేవారు ఇతరులున్నారని చెబితే అది 'షిర్క్' అవుతుంది. అలాగే మన అనునిత్య వ్యవహారాలలో వేరొకరికి దఖలు కల్పించటం, ఉదాహరణకు - దైవాన్నేగాక ఇతరులను కూడా మొక్కుకోవడం, మొక్కుబడులు చెల్లించటం వంటివి కూడా బహు దైవారాధనగానే భావించబడతాయి. వాస్తవానికి 'షిర్క్' చాలా పెద్ద అన్యాయం, దుర్మార్గం, ఘోర అపచారం. హకీమ్ లుక్మాన్ తన కుమారుడ్ని ఉపదేశిస్తూ ఏమన్నారంటే;

> "నాయనా! దేవునితో పాటు ఎవరినీ భాగస్వాములుగా నిలబెట్టకు. యదార్థమేమంటే షిర్క్ చాలా పెద్ద జులుం."
>
> (లుక్మాన్ : 13)

పైవచనం ద్వారా తెలిసేదేమంటే లోకంలో అన్నిటికన్నా పెద్ద అన్యాయం అపరాధం దైవంతోపాటు ఇతరుల్ని భాగస్వాములుగా చేయటమే.

మానవ జీవితాన్ని 'తౌహీద్' అనే చట్రంలో బిగించింది ఇస్లామ్. మానవుడు జీవితంలో ఒక్కో విషయంపై ఒక్కో విధంగా స్పందిస్తాడు. ఒక్కోసారి సంతృప్తుడై ఉంటాడు. ఒక్కోసారి వ్యాకులతకు గురవుతాడు. ఒకప్పుడు ఒక విషయాన్ని మెచ్చుకుంటాడు. మరొకప్పుడు మరో విషయాన్ని అసహ్యించుకుంటాడు. ఆపద సమయాల్లో దుఃఖితుడై దైవాన్ని మొరపెట్టుకుంటాడు. జీవితంలో ఈ విషయాలన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని వున్నాయి. అందుకే సర్వకాల సర్వావస్థల్లో మనిషి కేవలం తన

సృష్టికర్త వైపుకే మరలాలని, ఆయనకే విధేయుడై ఉండాలని ఆదేశించబడింది. ఎందుకంటే పాలకుడు, పోషకుడు, యజమాని, స్వామి, ఆరాధ్యుడు, సార్వభౌముడు ఆయనే. జీవన్మరణాల ప్రదాత కూడా ఆయనే. అందువల్ల దేవుని ఏకత్వపు భావన (తౌహీద్) దాసుడయిన మనిషి అణువణువునూ పెనవేసుకుని ఉండాలి. అతను ఏది చెప్పినా, ఏది చేసినా అతని అధరాలు దేవుని పవిత్రతను కొనియాడాలి.

ఇక్కడ గమనార్హమయిన ఇంకొక విషయం ఏమిటంటే ఖుర్‌ఆన్‌లో "లా తుష్రికు బిహీ" అని మాత్రమే అనబడలేదు - దాంతోపాటు "షయ్ అన్' అని కూడా చెప్పబడింది. అంటే మనిషి ఏ విధమయిన కొద్దిపాటి షిర్క్‌ను కూడా చేయరాదని భావం. దైవేతరుణ్ణి దేవుని సరసన చోటు కల్పించడం మాత్రమే షిర్క్ కాదు - ఏదయినా సత్కార్యం చేస్తూ ప్రదర్శనా భావానికి మనసులో చోటిచ్చినా చాలు, అది కూడా షిర్కే అవుతుందని హదీసు ద్వారా రూఢీ అవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి తాను చేసే నమాజ్‌ను చూసి దేవుడు సంతోషించటమేగాకుండా, ఇరుగు పొరుగువారంతా తన గురించి మంచిగా చెప్పుకోవాలని ఆశిస్తే అదీ ఒక విధమయిన షిర్కే అవుతుంది. అదే విధంగా ఒక వ్యక్తి తాను చేసే దానధర్మాలకు దేవుడు మెచ్చుకోవటంతో పాటు ప్రజలు కూడా తనను ఒక ధర్మదాతగా పొగడాలని తలపోశాడంటే అది కూడా ఒకలాంటి షిర్కే అనిపించుకుంటుంది. అలాగే ఇంకొక వ్యక్తి - తాను దైవ మార్గంలో నిరంతర పోరాటం సాగించినందుచేత యోధునిగా, వీరునిగా తన కీర్తి ప్రతిష్ఠలు సర్వత్రా మారుమ్రోగాలని అనుకుంటే అదీ షిర్క్ కోవలోకే వస్తుంది. ఇలాంటి వారు చేసుకున్నదంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. అందుకే "లా తుష్రికూ బిహీ షయ్ అన్' అని స్పష్టంగా చెప్పివేయటం జరిగింది. దివ్య ఖుర్‌ఆన్‌లో మరో చోట ఏమనబడిందంటే;

"తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడల్లా సదాచరణ చేయాలి. మరియు ఆరాధనలో తన ప్రభువుతో పాటు ఎవరినీ భాగస్వాములుగా చెయ్యరాదు. (అల్ కహఫ్ : 110)

ఈ ఆయత్ యొక్క పూర్వరంగం గమనించదగినది. ఒక వ్యక్తి మహాప్రవక్త (స) సమక్షంలో వచ్చి తాను జిహాద్ (దైవ మార్గంలో పోరాటం) చేయదలుస్తున్నానని, అయితే తన ఈ జిహాద్‌ను అల్లాహ్‌తో పాటు ప్రజలు కూడా మెచ్చుకోవాలన్నది తన అభిలాష అనీ విన్నవించుకున్నాడు. ఆతని ఈ కోరికకు సమాధానంగా పై వచనం అవతరించింది.

## ఒక సందేహ నివృత్తి

అయితే ఎవరయినా ప్రాపంచిక కీర్తిప్రతిష్ఠల్ని ఆశించకుండానే వారికవి ప్రాప్తమయితే అవి దైవం తరపున వారికి లభించిన నగదు బహుమతులనుకోవాలి. పండితులయినా, పారంగతులయినా, దాతలయినా, ధీరులయినా - ప్రాపంచిక కీర్తిప్రతిష్ఠల్ని ఆశించకుండా నిస్వార్థంగా పాటుపడినప్పుడే 'సత్కార్యం చేసినవారవుతారు, తద్భిన్నంగా వారు ఇక్కడే ఇప్పుడే కీర్తిప్రతిష్ఠల్ని ఆశిస్తే పరలోకంలో వారి కృషికి సత్ఫలితం లభించదు. పైగా వారి సత్కార్యాలు వారిని నరకానికి పాత్రులుగా నిలబెడతాయి. అందుకే ఇస్లామ్‌లో 'ప్రదర్శనా బుద్ధి ని 'షిర్క్'గా పేర్కొనటం జరిగింది. ఇది అగోచరమైన షిర్క్. ఇది చాలా ప్రమాదకారి. గొప్ప గొప్ప నిష్ఠాపరులనే ఇది వినాశపు లోయల్లోకి నెట్టివేస్తుంది. అందుకే "లా తుష్రికూ బిహీ షయ్ అన్" అని అనబడింది.

ఒక హదీసులో ఉంది

"అఖ్వఫు మా అఖాపు అలైకుమ్ అష్షిర్కుల్ అస్గర్ ఫసుయిల అన్‌హు ఫఖాల." (అత్రియాయ)

"అన్నిటికన్నా నేను, మీరెక్కడ షిర్కె అస్గర్ (చిన్న షిర్క్)కు గురవుతారోనని

భయపడుతున్నాను" అని అంతిమ దైవ ప్రవక్త (సఅసం) చెప్పారు. అప్పుడు "షిర్కె అస్గర్ అంటే ఏమిటి?" అని అనుచరులు అడుగగా "ప్రదర్శనా బుద్ధి" అని ఆయన (సఅసం) సమాధానం ఇచ్చారు.

అందుకే రుజుమార్గంపై నడవాలనుకునే మనిషి ముందు తన మనోమస్తిష్కాలను శుద్ధి చేసుకోవాలి. అంటే, అన్ని రకాల అంతర్బాహ్యాల షిర్క్ నుండి తనను అతీతంగా ఉంచుకోవాలి.

## రుజుమార్గంలో రెండవ విధానం :

తల్లిదండ్రులతో ఉత్తమంగా వ్యవహరించాలన్నది రెండవ కట్టడి. దివ్య ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల తౌహీద్ (ఏక దైవారాధన) గురించి ప్రబోధించిన వెంటనే తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగమని నొక్కి చెప్పటం జరిగింది.

ఉదాహరణకు క్రింది ఆయత్‌లనే చూడండి :

1. "నీ ప్రభువు నిర్ణయం చేసేశాడు : మీరు కేవలం ఆయన్ని తప్ప మరెవర్నీ ఆరాధించకండి, తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి." (బనీ ఇస్రాయీల్ : 23)

2. "నాయనా! దైవానికి సహవర్తులుగా ఎవరినీ కల్పించకు. యదార్థమేమంటే షిర్క్ చాలా పెద్ద అన్యాయం (అని లుక్మాన్ తన కుమారునికి ఉపదేశించాడు). ఇంకా యదార్థం ఇది: తన తల్లిదండ్రుల హక్కును గుర్తించమని మేము మనిషికి తాకీదు చేశాము. అతని తల్లి అతన్ని పీడనపై పీడనను అనుభవిస్తూ తన గర్భంలో మోసింది. మరి అతను పాలు విడవటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (కనుక) నాకు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞుడవై ఉండు." (లుక్మాన్: 13, 14)

3. మేము ఇస్రాయీల్ సంతానం నుండి మరొక ప్రమాణం తీసుకున్నాము. దాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి: "అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు: తల్లిదండ్రుల్ని, బంధువుల్ని, అనాథల్ని, నిరుపేదల్ని ప్రేమతో ఆదరించాలి."

(అల్ బఖర : 83)

తల్లి ఒడి పిల్లలకు ప్రాథమిక బడి వంటిది. అందుకే పిల్లల శిక్షణా బాధ్యతను అందరికన్నా ముందు తల్లిదండ్రులు వహిస్తారు. ప్రతి శిశువు ధరిత్రిపై అడుగు పెట్టేప్పుడు సాధుస్వభావంతోనే, దోషరహితుడుగానే అడుగుపెడతాడు. ఒక హదీసులో ఇలా ఉంది: "ప్రతి శిశువు ధరణిపై సహజత్వం పైనే వస్తాడు. అయితే అతని తల్లిదండ్రులు అతన్ని యూదునిగానో, క్రైస్తవునిగానో, పారసీకునిగానో (జొరాష్ట్రియన్) చేస్తారు.

సంతాన శిక్షణకు సంబంధించినంతవరకు తల్లిదండ్రుల్లో సహజసిద్ధమయిన కొన్ని గుణాలు ఉంటాయి. పిల్లల ఆలనా పాలన, మమతానురాగాల ప్రదర్శన, క్షమ, జాలి - ఇత్యాది విషయాల్లో మానవమాత్రులయిన తల్లిదండ్రుల్లో ఒక విధమైన దైవిక గుణం తొణికిసలాడుతూ ఉంటుంది. తన తల్లి తనను ఎన్ని కష్టాలకోర్చి, ఎన్నెన్ని అవస్థలను అధిగమించి కన్నదో, మరి ఆపైన తల్లిదండ్రులు ఎన్ని బాధల్ని భరించి తనను సాకారో, తనను ప్రయోజకునిగా మలచటానికి ఎన్ని తంటాలు పడ్డారో ఏ వ్యక్తీ ఖచ్చితంగా ఊహించలేడు. అందుకే మానవ మహోపకారి (సఅసం) "తల్లిదండ్రుల మెప్పులోనే దేవుని మెప్పు ఇమిడి ఉంద"ని బోధించారు.

అయితే తల్లిదండ్రులకు విధేయత కనబరచి, వారి ఆజ్ఞలను శిరసావహించవలసింది మంచి విషయాల్లో మాత్రమే. అధర్మమయిన, అపసవ్యమయినవాటిని గురించి వారు పురమాయిస్తే చేయవలసిన అవసరం

లేదు. కాని వారు కన్న తల్లిదండ్రులైనందువల్ల వారిని ఈసడించుకోరాదన్నది ఆదేశం. జీవితంలో తల్లిదండ్రులను పొంది వారి సేవలు చేసి స్వర్గంలో ప్రవేశించలేని వ్యక్తిని దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలామ్) శపించినట్లు హదీసుల ద్వారా తెలుస్తోంది.

ఒక సారి ఒక వ్యక్తి దేవుని అంతిమ ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి తాను చూపే గౌరవ మర్యాదలకు ఎక్కువ హక్కుదారులెవరని అడుగగా, "నీ తల్లి' అని మహా ప్రవక్త సమాధానమిచ్చారు. 'ఆ తర్వాత ఎవరు?' అని అడిగితే 'నీ తల్లి' అనే చెప్పారు. మూడవసారి కూడా అదే బదులిచ్చారు. నాల్గవ సారి అడిగితే అప్పుడు 'నీ తండ్రి' అని ప్రవక్త (స) గారు పలికారు.

మరో సందర్భంలో మహా ప్రవక్త (సఅసం) "నీచుడైపోయాడు" అని మూడు సార్లు పలికారు. 'ఎవడా నీచుడయిన వాడు?' అని సహచరులు దర్యాప్తు చేయగా "తల్లిదండ్రులను లేక వారిరువురిలో ఏ ఒక్కరినయినా వృద్ధాప్యంలో పొంది కూడా స్వర్గానికి నోచుకోలేకపోయినవాడు" అని వివరించారు (స).

తల్లిదండ్రుల యెడల సత్ప్రవర్తనకు సంబంధించి మూడు విషయాలు ముఖ్యమైనవి.

1. వారి గౌరవాన్ని, ఉన్నతిని సతతం దృష్టిలో పెట్టుకోవాలి.
2. వారికి విధేయులై ఉండాలి. అంటే వారి సేవలు చేయాలి.
3. వారి యెడల ఉత్తమ రీతిలో మసలుకోవాలి. వారి మనసు నొచ్చుకోకుండా జాగ్రత్తపడాలి.

తల్లిదండ్రులను ఖాతరు చేయనివాడు స్వర్గానికి చేరుకోలేడు. వేరే మాటల్లో - స్వర్గంలో ప్రవేశించటానికి తల్లిదండ్రుల నుండి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ **(N.O.C)** పొందటం అవసరం. కనుక ఏ వ్యక్తయితే కన్నవారి

యెడల మంచిగా మెలుగుతాడో న్యాయానికి మించి వారికి ఉపకారం చేస్తాడో అతడు వాస్తవంలో రుజుమార్గంపై ఉన్నట్లు లెక్క. ఇలా చేయలేనివాడు రుజుమార్గపు పట్టాల నుండి జారిపోయాడని అనుకోవాలి.

## మూడవ నిబంధన :

రుజుమార్గంపై పడవటానికి గల మూడవ షరతు, మనిషి దారిద్ర్య భయంతో, ఆర్థిక సామాజిక సమస్యల దిగులుతో తన సంతానాన్ని హతమార్చకుండా ఉండటం. సంతానహత్యకు పాల్పడటమంటే పుట్టిన శిశువులను చంపటమొక్కటే కాదు, మందుల ద్వారా, గర్భస్రావాల ద్వారా, కుటుంబ నియంత్రణా పథకాల ద్వారా - శిశువులను ధరణిలో కాలిడకుండా అడ్డుకునే చర్యలన్నీ సంతాన హత్యగానే పరిగణించబడతాయి.

షరీఅత్ దృష్టిలో సంతాన హత్య ఘోర అపరాధం! అది క్రూరత్వానికి, దుర్మార్గానికి, ప్రతీక!! అది దైవేచ్ఛపై మానవుని ఆక్షేపణకు, నిరసనకు, తిరుగుబాటుకు ఆనవాలు!!! 'నేను మీకు ఆహారం ఎలా ఇస్తున్నానో అలాగే వారికీ ఇస్తాను' అని అల్లాహ్ అంటున్నాడు. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడింది:

"మీ ఉపాధి (ఆహారం), మరి మీతో వాగ్దానం
చెయ్యబడేది కూడా ఆకాశంలోనే ఉంది." (అజ్జారియాత్:22)

సకల వ్యవహారాల కళ్ళెం దేవుని చేతిలో ఉంది. సమస్త నిధుల, ధనాగారాల తాళం చెవులు కూడా ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. ఆయన ఎవరికైనా ఉపాధిని ఇవ్వదలిస్తే దాన్నెవరూ అడ్డుకోలేరు. ఆయన ఎవరికయినా ఇవ్వదలచకపోతే ఎవరూ ఆయన్నుండి ఇప్పించనూ లెరు.

1. "భూమి మరియు ఆకాశాలలోని ధనాగారాలకు యజమాని అల్లాహ్‌యే." (అల్ మునాఫిఖూన్ : 7)

2. "భూమ్యాకాశాల యందున్న ధనాగారాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి." (అజ్జుమర్ : 63)

అందుకే దారిద్ర్య భయంతో సంతానాన్ని హతమార్చరాదు. ఉపాధి విషయంలోగాని, వనరుల విషయంలోగాని మానవుడు ఎన్నటికీ సరైన అంచనా వేయలేడు. ఏ ఏ కాలాల్లో, ఏ ఏ పరిస్థితుల్లో ఎలాంటివారి అవసరముంటుందో ఎవరికి తెలుసు? ఆ విషయాన్ని పుట్టించినవాడే బాగా ఎరిగి ఉంటాడు.

## మాల్థస్ మహోదయుని కాకి లెక్కలు

వనరులు, వాటి పరిణామాలను అంచనా వేయటంలో మానవులు ఎన్నో సందర్భాలలో పొరబాటుపడ్డారు. ఉదాహరణకు గత 50 ఏళ్లుగా జనాభా మరియు ఉత్పత్తుల పెరుగుదలను, వాటి తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలిస్తే మాల్థస్ జనాభా సిద్ధాంతం (Malthus Population Theory) తప్పుల తడక అని తేలిపోతుంది. మాల్థస్ సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తుల కన్నా జనాభా ఎన్నో రెట్లు ఎక్కువగా పెరుగుతుంది. పర్యవసానంగా ఒక దశ తరువాత జనాభా బహుగుణీకృతమై దుర్భిక్షంగా ఏర్పడుతుంది. మనిషిని మనిషి పీక్కుతినే నికృష్ట స్థితి దాపురిస్తుంది.

కాని అలా జరగలేదు. జన సంఖ్య దిన దిన ప్రవర్ధమానమవుతున్న భారతదేశంలో సయితం ఆహారోత్పత్తులు అంచనాలకు మించిపోతున్నాయి.

అరేబియాలో పెట్రోలు ఉత్పత్తులనే తీసుకోండి. నేటికి కొన్ని దశాబ్దాల క్రితం రోజుల తరబడి ఖర్జూరపు పండ్లతోనే సరిపుచ్చుకునే అరబ్బులు నేడు పెట్రోలు ద్వారా కోట్లకు పడగలెత్తారు. అంతేకాదు, ఆ పెట్రోలు ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరిస్తోంది. ఒకప్పుడు కటిక దారిద్ర్యానికి నిలయమయిన ఆ ఎడారి ప్రాంతం ఇప్పుడు లక్షలాది నిరుద్యోగుల పాలిట శ్రీ నిలయమై నిలిచింది. ఇదంతా భూమ్యాకాశాల యందలి ధనాగారాలకు

యజమాని అయిన అల్లాహ్ శక్తికి, మహత్తుకు ప్రతీక కాదా?

చెప్పవచ్చిందేమంటే మనిషైనవాడు జనాభాను తగ్గించే యోచనను మానుకుని అనంతమయిన వనరులను అన్వేషించి ఉత్పత్తులను పెంచే యోచన చేయాలి. కొంగ్రొత్త ఆవిష్కరణలకు పూనుకోవాలి. ఆ విధంగా అతను సహజసిద్ధమయిన తన తెలివితేటలకు వన్నె తెచ్చే పనులు చేయాలిగాని చేతకాని చవటగా తయారవకూడదు.

తప్పనిసరి పరిస్థితిలో ఆపరేషన్ చేసుకునేందుకు షరీఅత్ అనుమతిస్తుంది. కాని జీవన ప్రమాణం తగ్గుతుందన్న ఉద్దేశ్యంతోనో, లేక ఆస్తిపాస్తులు తరిగిపోతాయన్న భయంతోనో, వైవాహిక సమస్యల్ని ఎదుర్కోవలసివస్తుందన్న నైరాశ్యంతోనో సంతానోత్పత్తిపై తమకు తాముగా నియంత్రణలు విధించుకుంటే అది షరీఅత్‌కు, దాని నైజానికి విరుద్ధమవుతుంది. ఈ యదార్థాన్ని అర్థం చేసుకోకుండా - తామే భావితరాల వారి పోషకులం అని తలపోస్తుండేవారు నిరంతరం తప్పటడుగులు వేసి నష్టపోతూనే ఉంటారు. అలాంటి వారినుద్దేశ్యించి ఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

> "ఎవరైతే అజ్ఞానం వల్ల మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్యచేశారో, ఇంకా అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని అల్లాహ్ పై అబద్ధాలు కల్పిస్తూ నిషేధించుకున్నారో వారు నిశ్చయంగా నష్టపడ్డారు. నిస్సందేహంగా వారు భ్రష్టులయ్యారు. ఎన్నటికీ రుజుమార్గం పొందేవారు కాదు."

(అల్ అన్ ఆమ్ : 140)

## మారని మనిషి

14 వందల సంవత్సరాల క్రితం అజ్ఞానులు, అనాగరికులయిన అరబ్బులు ఆడ పిల్లల హత్యకు పాల్పడేవారంటే నేడు విజ్ఞులు, నాగరికులయిన ప్రజలు భ్రూణ హత్యకు ఒడిగడుతున్నారు. అప్పటికీ-ఇప్పటికీ మానవ ప్రవృత్తిలో మార్పు రాలేదు. మారిందల్లా హత్యా 'విధానం' మాత్రమే. అప్పట్లో అరబ్బులు పుట్టిన ఆడబిడ్డలను సజీవంగా పాతిపెడితే, నేటి సభ్య సమాజ సభ్యులేమో ఆడపిల్ల ప్రాణం పోసుకుంటోందని తెలియగానే - మాతృ గర్భంలోనే - సమాధి చేసివేస్తున్నారు.

## నాల్గవ నిబంధన

రుజుమార్గాన పయనించగోరేవారు అశ్లీల విషయాల జోలికి పోరాదనేది మరొక ఆదేశం. ప్రజలు అన్ని రకాల నీతి బాహ్యమయిన పనుల నుండి, చెడు చేష్టల నుండి దూరంగా ఉండాలన్నదే ఈ ఆదేశంలోని పరమార్థం. నీతి మాలిన పనుల్లో కొన్నిటి రూపం పైకి కానవస్తుంది. మరికొన్నిటి రూపం కానరాదు. అందుకే చెడు పనుల్లో "కానవచ్చేవి - కానరానివి" రెంటి నుండీ తమను కాపాడుకోమని చెప్పటం గమనార్హం. సంబంధిత ఖుర్‌ఆనీ ఆయత్‌లో "లాతఖ్ రబు" అనే పదం వచ్చింది. అంటే దరిదాపులకు కూడా పోరాదని దీని భావం. కాబట్టి చెడుల వైపుకు మనిషిని లాక్కుపోయే విషయాల పట్ల సయితం మనిషి అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే, ఏ విధంగానయితే ఒక చిన్న పుల్ల ద్వారా కట్టెలన్నీ మండుతాయో అదే విధంగా చిన్న చిన్న పాపాలే మనిషిని మహాపరాధాల వైపుకు లాక్కెళతాయి.

## ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో నీతి బాహ్యమైన పనులు

పవిత్ర ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది -

"వ్యభిచారం దరిదాపులకు పోకండి, అది అతి దుష్ట కార్యం,
బహు చెడ్డ మార్గం." (బనీ ఇస్రాయీల్ : 32)

పై వచనంలో వ్యభిచారం దుష్టకార్యమని, నీతిబాహ్యామైన చేష్ట అని చెప్పబడింది. ఈ ఆయత్‌కు తాత్పర్యంగా ఒక హదీసు ఉంది. దాని ప్రకారం మనిషి పరాయి స్త్రీని చెడు దృష్టితో చూస్తే అది కంటి వ్యభిచారం అవుతుంది. ముట్టుకుంటే అది చేతి వ్యభిచారం అవుతుంది. నీతి బాహ్యమయిన మాటలు మాట్లాడితే అది అతని నోటి వ్యభిచారమవుతుంది. ఆ చెడు కార్యం వైపుకు నడచి వెళితే అది కాలి వ్యభిచారమవుతుంది. ఈ విధంగా ఈ దశలన్నీ మనిషిని వ్యభిచారం వైపుకు తీసుకువెళతాయి. అంటే ఈ చిన్న చిన్న పాపాలన్నీ పెద్ద పాపానికి మూలమవుతాయి. చిన్న చిన్న పాపాలు అన్ని కాలాల్లోనూ కొత్త రూపు ధరిస్తుంటాయి. అవి ఆయా కాలాల విద్యాశిక్షణలను, సంస్కృతీ నాగరికతలను, నీతి నడవడికలను, ప్రగతీ వికాసాలను కూడా ప్రభావితం చేస్తుంటాయి. ఉదాహరణకు, ఆధునిక యుగంలోని సినిమాలు, టీవీలు, వీడియోలు, అశ్లీల సాహిత్యం, అర్ధ నగ్న పోస్టర్లు మొదలగునవి సమాజం నైతికంగా దివాలా తీయటంలో నిర్వహిస్తున్న పాత్రను ఎవరూ కొట్టివేయలేరు. తెలిసిందేమంటే చెడుల కొన్ని కారణాలు కంటికి కానవస్తాయి, మరికొన్ని కానరావు. కొన్ని ప్రత్యక్ష పాత్రను పోషిస్తే మరికొన్ని పరోక్ష పాత్రను పోషిస్తాయి. అందుకే ఖుర్‌ఆన్ 'వ్యభిచారం చెయ్యకండి' అని అనే బదులు 'వ్యభిచారం సమీపానికి కూడా పోకండి' అని చెప్పింది.

నీతి బాహ్యామైన పనులు మరియు చెడు చేష్టలకు సంబంధించిన మరికొన్ని దృష్టాంతాలు :-

1. ఓ! ప్రవక్తా! వారితో అనండి, "నా ప్రభువు నిషేధించినవైతే ఇవి : సిగ్గుమాలిన పనులు -

బహిరంగమయినవి గాని లేక గుప్తమయినవి గాని - పాప కార్యాలు...."

(అల్ ఆరాఫ్ : 33)

2. "విశ్వసించినవారి ఒక వర్గంలో నీతి బాహ్యత వ్యాపించాలని కోరుకునేవారు ఇహలోకం మరియు పరలోకంలో కూడా వ్యధాభరితమయిన శిక్షకు అర్హులు. అల్లాహ్‌కు తెలుసు, మీకు తెలియదు." (నూర్ : 19)

తప్పుడు నిందలు మోపటం, వాటిని ప్రచారం చేయటం, అటువంటి చెడుగులనే సమాజంలో వ్యాపింపజేయటం వంటి పనులన్నీ 'నీతి బాహ్యత' కోవలోకే వస్తాయని పై ఆయత్‌లో చెప్పబడింది. అశ్లీలమయిన ఆటపాటలను, బూతు సినిమాలను చూడటం, స్త్రీ పురుషుల అవధులు దాటిన ఆనంద ప్రలాపనలు, అశ్లీలం, సెక్స్ గుప్పించబడిన పుస్తకాల ప్రచురణ, సజ్జనులపై నీలాపనిందలు మోపటం, సమాజంలో అపోహలను సృష్టించటం - ఇవన్నీ నీతిబాహ్యమయిన పనుల పరిధిలోకే వస్తాయి. నీతి బాహ్యతకు ఒడిగట్టినవారిని ఇస్లామీయ వ్యవస్థలో కఠినంగా శిక్షించటం జరుగుతుంది. పరలోకంలోనయితే అటువంటి దుర్మార్గులు వ్యధాభరితమయిన శిక్షకు గురవుతారు.

3. "ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమయిన, పరిశుభ్రమయిన వాటినన్నింటినీ మీరు తినండి, షైతాన్ చూపే మార్గాలను తొక్కకండి. అతడు మీకు బహిరంగ శత్రువు. దుర్మార్గాన్ని, అశ్లీలాన్ని చెయ్యమని అతడు మిమ్మల్ని ఆజ్ఞాపిస్తాడు. ఏ విషయాలను గురించి అయితే మీకు తెలియదో ఆ విషయాలను అల్లాహ్ పేరుతో చెప్పమని మిమ్మల్ని ప్రేరేపిస్తాడు." (అల్ బఖర : 168, 169)

పై వచనాలను బట్టి అల్లాహ్ పేరునగాక ఇతర విగ్రహాల, కీర్తిశేషుల, హజ్రత్‌ల పేర పశువులను బలి ఇవ్వటం నిషిద్ధం (హరామ్) అవుతుంది. ఉదాహరణకు మేకను గాని, కోడిని గాని గైరుల్లాహ్ (దైవేతరుని) పేర 'జిబహ్' చేస్తూ 'బిస్మిల్లాహ్' అని పలికినప్పటికి అది ధర్మసమ్మతం అనిపించదు. వాస్తవంలో అది నిషిద్ధమే. ఎందుకంటే 'మొక్కుబడి' కూడా ఒక ఆరాధనే. ఆరాధనలో అల్లాహ్‌తో పాటు వేరొకరికి స్థానం కల్పిస్తే, అది షిర్క్ అవుతుంది. షిర్క్ హరామ్ కాబట్టి (దైవేతరుని పేరున చేసే) ఈ పశుత్యాగం కూడా హరామే (నిషిద్ధమే) అవుతుంది. అంటే, ఆ పశువు మాంసం తినటం, ఇతరులకు తినిపించటం కూడా హరామే. అయితే ఇలాంటి విషయాల దగ్గరికొచ్చేసరికి షైతాన్ ఎంతో చాకచక్యంగా మనిషిపై ఆధిపత్యం చెలాయించజూస్తాడు. తన మాయోపాయాలతో మనిషిలోని విచక్షణా జ్ఞానాన్ని స్థంభింపజేసి, అతనిచేత పొరబాట్లు చేయిస్తాడు. 'హరామ్'ను హలాల్‌గా నిరూపించేందుకు విశ్వప్రయత్నం చేస్తాడు. సాధారణంగా ఇటువంటి విషయాలు చూచేవారికి 'హరామ్'గా అగుపించవు. అందుచేతనే పాపాలు - బహిరంగమయినవైనా, గుప్తమయినవయినా - వాటిని విడనాడాలని ఆదేశించటం జరిగింది.

> 4. ఏదైనా సిగ్గుమాలిన పనిచేసినప్పుడు ఈ ప్రజలు ఏమంటారంటే, "ఇదే సంప్రదాయాన్ని మా తాతముత్తాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూశాము. ఈ విధంగా చెయ్యమని అల్లాహ్‌యే మమ్మల్ని ఆదేశించాడు." వీరితో అనండి, "సిగ్గుమాలిన పనిని అల్లాహ్ ఎన్నటికీ ఆదేశించడు, ఏ విషయాలయితే అల్లాహ్ తరపు నుండి వచ్చాయని మీకు తెలియదో ఆ విషయాలను మీరు అల్లాహ్ పేరుతో ప్రకటిస్తున్నారా?" (అల్ ఆరాఫ్ : 28)

పై వచనంలో అసభ్యమయిన ఒక ఆచారాన్ని నిషేధిస్తూ దేవుడు ఆదేశం జారీ చేశాడు. పూర్వం అరబ్బులలో అనేక మంది స్త్రీ పురుషులు హజ్ సమయంలో దిగంబరులై కాబా ప్రదక్షిణం చేసేవారు. నీతిమాలిన ఈ చేష్టకు సిగ్గుచెందే బదులు వారు దాన్నొక పవిత్ర కార్యంగా భావించేవారు. ఏ దుస్తులు ధరించి తాము ఇదివరకు పాప కార్యాలు చేశారో అవే దుస్తులు ధరించి కాబా ప్రదక్షిణం చేస్తే అపచారమవుతుందేమోనని వారికి అనుమానమేసింది. వారి వైఖరిని ఖండిస్తూ ఇస్లాం, నగ్నంగా దైవ గృహం చుట్టూ తిరగటం నీతిబాహ్యమయిన చేష్ట అని చెప్పింది.

కాని, శోచనీయమైన విషయమేమిటంటే అటువంటి సిగ్గుమాలిన పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ముస్లిమేతర సమాజాల సంగతి అలా ఉంచండి, స్వయంగా ముస్లిం సమాజంలోనూ ఉరుసుల పేర - సమాధుల వద్ద జరిగే అవధులు మీరిన ప్రలాపనలను గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాగే ముషాయిరాలలో, హాస్యసదనాలలో గుప్పించబడే అశ్లీలం, ద్వంద్వార్థాలతో కూడిన పదాలు కూడా దాదాపు నీతి బాహ్యతగానే పరిగణించబడతాయి. ఇలాంటివన్నీ ధర్మానికి, షరీఅత్‌కు విరుద్ధమయినవి.

> 5. "ఓ విశ్వాసులారా! షైతాన్ పాద చిహ్నాలపై నడవకండి. ఎవరయినా వాడిని అనుసరిస్తే, వాడతనికి నీతిబాహ్యత మరియు చెడును గురించే ఆజ్ఞాపిస్తాడు." (నూర్ : 21)

షైతాన్ ప్రేరణతో ప్రభావితమై ఏ ఆధారమూ లేకుండా సద్వర్తనులయిన స్త్రీ పురుషులపై అభాండాలు మోపరాదని పై వచనంలో విశ్వాసులకు ఉద్బోధించబడింది. (మహా ప్రవక్త సహధర్మచారిణి అయిన హజ్రత్ ఆయిషా-రజి-పై మదీనాలోని కపటులు అపనింద మోపటం ఇక్కడ గమనించదగినది). అదే విధంగా నీతిబాహ్యమయిన పోకడల పరివ్యాప్తికి

పాటుబడటం, తత్సంబంధితమయిన పుస్తకాలను, మ్యాగజైన్లను ముద్రించటం, నీతి బాహ్యమయిన భావాలను పెంపొందించే ఇతరత్రా సాధనాలను ప్రజాబాహుళ్యంలోనికి తీసుకుపోవడం కూడా షైతాన్‌కు విధేయత చూపటంతో సమానమే. అందుకే "లా తత్తబివూ ఖుతువాతి షయ్‌తాన్ " (షైతాన్ పాద చిహ్నాలలో నడవకండి) అని అనబడింది.

> 6. "నిశ్చయంగా నమాజ్ నీతిబాహ్యత మరియు చెడుల నుండి నిరోధిస్తుంది." (అన్ కబూత్ : 45)

పై వచనంలో 'నీతి బాహ్యత' (ఫహషాయి) అనే మాట లైంగిక వాంఛలకు సంబంధించిన అక్రమ వ్యవహారాల నేపథ్యంలో ఉపయోగించ బడింది. వాటి స్వరూపం ఒక్కో కాలంలో ఒక్కో విధంగా ఉండింది. "మున్కర్' అనే పదం ఆస్తి అంతస్థుల మూలంగా, అత్యాశ, సంతులన రాహిత్యం మూలంగా మనిషిలో జనించే చెడుగులను ఉద్దేశ్యించి ఉపయోగించబడింది. ఉదాహరణకు అహంకారం, అసూయ, పిసినారితనం, దగా, మోసం మొదలగునవి. అయితే నమాజ్ మనిషిలోని ఈ దుర్గుణాలన్నిటినీ పారద్రోలి సచ్ఛీలునిగా అతన్ని తీర్చిదిద్దుతుంది.

> 7. మేము లూత్‌ను పంపగా, అతను తన జాతి వారితో, "మీరయితే మీకు పూర్వం లోకవాసుల్లో ఎవరూ చేయని నీతిబాహ్యమయిన చేష్టకు ఒడిగడుతున్నారు" అన్నాడు. (అన్ కబూత్:28)

పై వచనంలోనూ ప్రవక్త లూత్ (అలైహి) కాలంనాటి ప్రజల దురలవాటును "ఫాహిష"గా చెప్పటం జరిగింది. పురుషులు పురుషులతోనే రతి క్రీడ సాగించటం లూత్ జాతిలోని దురలవాటు ఖుర్‌ఆన్ ప్రకారం -

ప్రపంచంలో నీచమయిన ఈ చేష్టకు పాల్పడిన మొదటి జాతి అదే. శోచనీయమయిన విషయం ఏమిటంటే, నేటి సభ్య ప్రపంచం ఎంతో తుచ్ఛమయిన ఆ చేష్టకు చట్టపరంగా అనుమతినిస్తోంది. దాని మూలంగా సమాజంలో ఎన్నో నైతికపు రుగ్మతలు, భయంకరమయిన వ్యాధులు సంభవిస్తున్నాయని తెలిసి కూడా పాశ్చాత్యులు దాన్ని సమర్థించటం విచిత్రం. ఇస్లామీయ వ్యవస్థలో మాత్రం ఇటువంటి విపరీతాలకు ఒడిగట్టేవారు శిక్షార్హులవుతారు.

> 8. "వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడయినా ఏదయినా లజ్జాకరమయిన పని వారి వల్ల జరిగిపోతే లేక ఏదయినా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయన్ని తమ తప్పులు క్షమించమని వేడుకుంటారు ఎందుకంటే అల్లాహ్ తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని - వారు తాము చేసిన తప్పుల పట్ల తెలిసీ మంకుతనం పట్టరు." (ఆలి ఇమ్రాన్ : 135)

పై వచనంలో వడ్డీ తినటం, దుబారా ఖర్చు చేయటం, పాప కార్యాల కొరకు ధనాన్ని వెచ్చించటం లాంటి పనుల కొరకు "ఫాహిషతన్" అనే పదం వాడబడింది. అదే సందర్భంగా మరో విషయం ఏమనబడిందంటే, ఎవరయినా, ఎప్పుడయినా, ఏదన్నా పాప కార్యం చేసిన వెంటనే దాన్ని తప్పని గ్రహించి సిగ్గు చెందితే, పశ్చాత్తాప భావంతో కృంగిపోతే దేవుడు ఆ వ్యక్తిని క్షమిస్తాడు. ఎందుకంటే అల్లాహ్ తన దాసుల మనోభావాలను బాగా ఎరిగినవాడు. ఎవరు నిజంగా పశ్చాత్తాపం చెందారో, మరెవరు కపట నాటకమాడతారో ఆయనకు తెలుసు. కనుక ఆయన చిత్తశుద్ధి గలవారి పశ్చాత్తాపాన్నే స్వీకరిస్తాడు.

9. "మేము ఆయన్నుండి చెడును, అశ్లీలాన్ని దూరం చేసేందుకు ఆ విధంగా జరిగింది. వాస్తవానికి ఆయన మేము ఎన్నుకున్న దాసుల్లోని వాడు." (యూసుఫ్ : 24)

ఈ ఆయత్, దైవ ప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) సౌశీల్యానికి, ఉత్తమ నడవడికకు అద్దం పడుతుంది. ఈజిప్ట్ అంతఃపుర స్త్రీ ఆయన్ని వలలో వేసుకోవటానికి ప్రయత్నించినప్పుడు, అల్లాహ్ ఆయన్ని నీతిబాహ్యమయిన చేష్టనుండి కాపాడాడు. ఎందుకంటే ఆ చెడు చేష్ట నుంచి దూరంగా ఉంచమని యూసుఫ్ (అలైహిస్సలామ్) తన ప్రభువును ప్రార్థించారు. ప్రభువు ఆయన ప్రార్థనను ఆలకించి ఈజిప్ట్ స్త్రీల జిత్తుల నుండి రక్షించాడు దీన్ని బట్టి చెడు సంకల్పంతో మనిషిని మోహింపజేయటానికి, వివశుణ్ణి చేయటానికి చేసే సామ దాన దండోపాయాలన్నీ "ఫవాహిష్"గానే పరిగణించబడతాయి.

10. "అల్లాహ్ న్యాయాన్ని, ఉపకారాన్ని, బంధువుల హక్కు నెరవేర్చటాన్ని ఆజ్ఞాపిస్తున్నాడు. మరియు చెడును, అశ్లీలతను, అన్యాయాన్ని, అత్యాచారాన్ని నిషేధిస్తున్నాడు." (అన్ నహ్ల్ : 90)

11. "తమ వల్ల జరిగే కొన్ని తప్పుల్ని మినహాయిస్తే వారు (సాధ్యమైనంతవరకు) పెద్ద పెద్ద పాపాలకు, బహిరంగమయిన చెడు చేష్టలకు దూరంగా ఉంటారు. నీ ప్రభువు క్షమాపణం బహు విశాలం అనటంలో సందేహం లేదు." (అన్నజమ్ : 32)

పై వచనంలో పెద్ద పెద్ద పాపాలకు, బహిరంగమయిన చెడు పనులకు, అసహ్యకరమయిన చేష్టలకు దూరంగా ఉండమని ఆదేశించబడింది. అరబీలో

"కబాయిరుల్ ఇస్మి వల్ ఫవాహిష్" అనే పదం ఉంది. ఒకరి హక్కును కాజేయటం, అన్యాయం అక్రమాలకు పాల్పడటం లాంటి పనులకు కూడా ఇది వర్తిస్తుంది. కాని పై ఆయత్‌లో మాత్రం బహిరంగమయిన చెడులు, సిగ్గుమాలిన పనులనుద్దేశించి "ఫవాహిష్" అని అనబడింది. చిన్న చిన్న పొరబాట్లు, తప్పులు "లమమ్"గా పేర్కొనబడ్డాయి. మానవ సహజమైన బలహీనత వల్ల స్వల్పమయిన తప్పులు జరిగిన పక్షంలో - వాటిపై మనిషి సిగ్గు చెందితే దేవుడు మన్నిస్తాడు. అయితే మనిషి పెద్ద పాపాల జోలికి వెళ్ళకుండా ఉన్నప్పుడే ఈ మన్నింపుకు నోచుకుంటాడు.

-ఇవీ ఖుర్‌ఆన్ ఆధారంగా 'ఫహష్' అనే అరబీ పదం పరిధిలోకి వచ్చే దుష్ట కార్యాల వివరాలు. పై వివరాల ప్రకారం చెడు చూపు, అసభ్యకరమయిన ఆటపాటలు, అశ్లీల సాహిత్యం మొదలుకుని వ్యభిచారం వరకు అన్నీ నీతిబాహ్యత (ఫహష్) గానే పరిగణించబడతాయి. తత్సంబంధితమైన పనుల చెడు కోణాలు కొన్ని పైకి కనిపిస్తాయి, మరికొన్ని కనిపించవు. అయితే విషపూరితమైన వాటి వ్రేళ్ళు యావత్తు సమాజాన్ని క్రమక్రమంగా ఆక్రమించుకుంటాయి. అందుకే "బహిరంగమైనవైనా", గోప్యమైనవైనా - అశ్లీల విషయాల దరిదాపులకు పోకండి" అని నిర్ద్వంద్వంగా చెప్పివేయబడింది.

అంటే -

ఎవరయితే ఈ చెడుగుల నుండి తమను రక్షించుకున్నారో వారు రుజుమార్గం అవలంబిస్తున్నారు. మరెవరయితే షైతాన్ ప్రేరణకులోనై పైన ప్రస్తావించిన అశ్లీల విషయాలకు లోనయ్యారో వారు షైతాన్‌కు బానిసలయ్యారు. ఇటువంటి వారు కూడా నమాజ్‌లో "రుజుమార్గం చూపమని" ప్రభువును వేడుకుంటున్నారంటే, లాంఛనప్రాయంగా మాత్రమే అలా పలుకుతున్నారు. యదార్థానికి వారిలో సంకల్ప శుద్ధిలేదు. దేవుడు మాత్రం సన్మార్గం చూపేది

సంకల్ప శుద్ధితో ప్రార్థించేవారినే.

## భిక్షాటనం అధోగతికి తార్కాణం

ఖుర్‌ఆనీ ఆయత్‌ల తరువాత ఇప్పుడు హదీసుల - అంటే మహాప్రవక్త (సఅసం) ప్రవచనాల - వెలుగులో 'ఫవాహిష్' ల నిర్వచనాన్ని తెలుసుకుందాం. హదీసుల ప్రకారం 'ఫవాహిష్' అనే పదం దొంగతనం. మద్యపానం. బిచ్చమెత్తటం వంటి వాటికి కూడా వర్తిస్తుంది. సంపాదించే తాహతు ఉండి కూడా అడుక్కుతినేవాడు ప్రళయ దినాన కుష్ఠు రోగిలా లేపబడతాడు. యదార్థానికి భిక్షాటనం ఒక అల్పమయిన విషయం. అది ఆయా ప్రజల లేక జాతుల అధమాతి అధమ స్థితికి తార్కాణం. ఇలాంటి ప్రొఫెషనల్ ఫకీర్లకు దానం చేయటం ధర్మసమ్మతం కూడా కాదు. నిరుపేదలు, సంపాదించే స్థోమత లేనివారు మాత్రమే యాచించటానికి అర్హులు. జీవితంలో ఉపాధి కోసం అన్ని ప్రయత్నాలు చేసి కూడా ఆహార సామగ్రిని సమకూర్చుకోలేనివారు యదార్థానికి యాచకులు కాగలరు. అటువంటివారు ఒక వేళ నోరు విప్పి అడిగినా అడగకపోయినా - సహాయానికి అర్హులే. ఇలాంటి వారిలో కొంత మందికి ఆత్మాభిమానం వల్ల చేయి చాచి అడగటానికి మనస్కరించదు. అటువంటి అభిమాన ధనుల ముఖాలు చూసి మీరు వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఖుర్‌ఆన్‌లో చెప్పబడింది. చెప్పవచ్చిందేమంటే, సంపాదించే తాహతు ఉండి కూడా భిక్షాటనను వృత్తిగా చేసుకున్నవారు సిగ్గుమాలిన చేష్టకు ఒడిగట్టినట్లు భావించాలి.

అదే విధంగా, మద్యపానం వల్ల కలిగే అనర్థాలు ఎవరికీ తెలియనివి కావు. మద్యం మనిషి ఆస్తిపాస్తుల్ని, ఆయురారోగ్యాలను హరించడమేకాక,అతని బుద్ధిని, విచక్షణా జ్ఞానాన్ని కూడా నాశనం చేసివేస్తుంది. తత్కారణంగా త్రాగుబోతు సంఘసభ్యుల ఆదరణకు నోచుకోలేకపోతాడు. అందుకే ఈ

దురలవాటుకు దూరంగా ఉండమని ఆజ్ఞాపించటం జరిగింది.

అలాగే దొంగతనం కూడా నీతిబాహ్యమైన పనిగానే అభివర్ణించబడింది. దొంగతనం చేసేవాడు. దోపిడీలు దొమ్మీలకు పాల్పడేవాడు సభ్య సమాజంలో సభ్యునిగా మనుగడ సాగించే అర్హతను కోల్పోతాడు. కారాగారం అతని నిలయమవుతుంది. కాని అత్యంత విచారకరమైన విషయం ఏమంటే మన సమాజంలో ఘరానా మనుషులుగా చెలామణి అవుతున్న వారు, విద్యావంతులు, ధనికులు సయితం తెలివిగా దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్నారు. వారి దొంగతనం పైకి కనబడకపోవటం వలననో లేక దాని ఫలితం వెంటనే బహిర్గతం కాకపోవటం మూలంగానో అది దొంగతనం అనిపించదు. అంత మాత్రాన వారు చేసేది నీతిమాలిన పని కాకుండా పోదు. ఇలాంటి ఎడ్యుకేటెడ్ దొంగలే సమాజం పాలిట చీడపురుగుల్లా పరిణమిస్తారు. ఉదాహరణకు మేధావి, అధికారి అయిన ఒక వ్యక్తి అవినీతికి పాల్పడతాడు. ఇతరులను మోసం చేస్తాడు- తద్వారా ముట్టిన అక్రమ సొమ్మును తింటూనే దైవారాధన చేస్తాడు. సంఘంలో దైవభీతిపరుడుగా చెలామణి అవుతుంటాడు. కాగా, షరీఅత్ ఏమంటుందంటే, అధర్మ సంపాదనను తినేవాడు చేసే ఆరాధన (ఇబాదత్) దైవ సమక్షంలో స్వీకారయోగ్యమవదు. అలాగే మరో వ్యక్తి అసూయ, కాపట్యం, పగ, ద్వేషం వంటి నకారాత్మక భావాలకు నిలయుడై, మానసిక రుగ్మతకు లోనవుతాడు. వాటి చెడుగులు బహిర్గతం కాకపోవచ్చేమోగాని అవి మనిషి సత్కార్యాలను మాత్రం నాశనం చేసివేస్తాయి. అందుకే "నీతి బాహ్యమయిన పనుల జోలికి (అవి బహిరంగమైనవైనా, రహస్యమైనవైనా) పోకండి" అని అనటం జరిగింది.

## ఐదవ నిబంధన

"సత్యం కొరకు తప్ప అల్లాహ్ పవిత్రంగా పరిగణించిన ఏ ప్రాణాన్నీ

హతమార్చకండి" అన్నది రుజుమార్గంలో ఆయిదవ నిబంధన.

మానవ ప్రాణం ఎంతో గౌరవనీయమయినది. విలువయినదని దీని ద్వారా తేటతెల్లమవుతోంది. ఎవరినైనా అన్యాయంగా చంపటం మహాపరాధం. యావత్తు మానవాళిని సంహరించటంతో సమానం. అయితే ఎవరయినా సత్యానికి అడ్డుగా నిలిస్తే, సమాజంలో ఉపద్రవానికి కారకుడయితే అటువంటి సమయంలో కొన్ని నియమాలకు కట్టుబడి అతన్ని దండించవచ్చు. ఉదాహరణకు,

1. ఏ ముస్లిమయినా వ్యభిచారం చేసినపుడు.
2. ఏ ముస్లిమయినా ధర్మభ్రష్టుడయినప్పుడు,
3. ఎవరయినా ఇంకొకరిని అన్యాయంగా హతమార్చినప్పుడు

ఈ మూడు కారణాలు తప్ప మరెట్టి స్థితిలోనూ ఎవరూ ఎవరినీ హతమార్చటానికి వీలు లేదు. వధిస్తే అది అధర్మమవుతుంది. ఒక ముస్లిమ్ మరో ముస్లిమ్ యొక్క ధన ప్రాణాలను, మానమర్యాదలను తప్పనిసరిగా గౌరవించాలి. ఈ ఐదు ఆజ్ఞల తర్వాత,

"జాలికుమ్ వస్సాకుమ్ బిహీ లఅల్లకుమ్ తాఖిలూన్ "

(బహుశా అర్థం చేసుకుని వ్యవహరిస్తారని ఈ విషయాలను ఆయన మీకు బోధించాడు) అని చెప్పబడింది.

దీన్ని బట్టి బోధపడేదేమంటే ఈ ఆదేశాలు విజ్ఞులు మరియు వివేకవంతుల కొరకు ఆచరణీయమయినవి. విజ్ఞులు, వివేకవంతులే వీటి ద్వారా ప్రయోజనం పొంది రుజుమార్గాన్ని అవలంబించగలుగుతారు.

## ఆరవ నిబంధన

"అనాధల ఆస్తి దరిదాపులకు పోకండి, వారు యుక్త వయస్సుకు చేరే వరకు - ఉత్తమమయిన పంథాలో తప్ప" అన్నది మరో

ఆజ్ఞ

ఎంత చక్కని ఆదేశం ఇది!

అశక్తతకు, అసహాయ స్థితికి పరాకాష్ఠ అనాథావస్థ. సమాజంలో అందరికన్నా ఎక్కువ బాధిత వర్గం వారెవరంటే వారు అనాథలే. తల్లిదండ్రుల చల్లని నీడను కోల్పోయిన వారు వాస్తవానికి అందరికన్నా ఎక్కువ జాలి చూపదగినవారు. అయితే అనాథ యొక్క అశక్తత, దీనావస్థలను ఎదుటివాడు తన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం కూడా లేకపోలేదు. ఈ కారణంగానే ఖుర్‌ఆన్, అనాథల పోషణను గురించి ప్రస్తావించినప్పుడల్లా, అనాథల హక్కును కాజేసేవారికి వ్యథాభరితమయిన శిక్ష ఉంటుందని హెచ్చరించింది. కారుణ్యమూర్తి ముహమ్మద్ (సఅసం) తన చేతి యొక్క రెండు వేళ్ళను కలిపి చూపెడుతూ అనాథల సంరక్షకుడు తనతో ఇంతే దగ్గరగా ఉంటాడని ప్రవచించారు. ఒక వ్యక్తి ప్రవక్త సన్నిధికి వచ్చి, తన హృదయ కాఠిన్యాన్ని దూరం చేసుకోవటానికి మార్గం సూచించమని విన్నవించగా, 'అనాథ తలను చేత్తో ఆప్యాయంగా నిమర'మని ప్రవక్తగారు ఉపదేశించారు. ఇలా చేయటం వల్ల హృదయ కాఠిన్యం కరిగి కనికారం పుడుతుందని దాని భావం. ఒక హదీసులో ఉంది:

> "ఏ వ్యక్తయినా ఒక అనాథ తలపై చేయివేసి ప్రేమతో నిమిరితే ఆ అనాథ తలపై ఎన్ని వెంట్రుకలైతే ఉంటాయో అన్ని సత్కర్మలు ఆ వ్యక్తికి లభిస్తాయి."

దీనికి భిన్నంగా, అనాథల సొమ్మును అన్యాయంగా కబళించేవారిని, అనాథల దీనావస్థ ద్వారా అక్రమంగా ప్రయోజనం పొందేవారిని ఉద్దేశ్యించి చెబుతూ మహాప్రవక్త (సఅసం) అటువంటి వారు గుండెలు నిప్పులు కక్కుతున్న స్థితిలో సమాధుల్లో నుంచి లేస్తారని అన్నారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది:

"అనాధల ఆస్తిని ఎవరైతే అన్యాయంగా తింటారో వారు వాస్తవానికి తమ పొట్టల్ని అగ్నితో నింపుకుంటారు. వారు మండే నరకాగ్నిలోకి తప్పకుండా త్రోయబడతారు."

(అన్ నిసా : 10)

ఇంకా ఇలా అనబడింది -

"అల్లాహ్ మీ కొరకు ఏ సొమ్మునయితే జీవనాధారంగా చేశాడో, దాన్ని అవివేకులకు అప్పగించకండి. అయితే దాన్నుండి వారి అన్నవస్త్రాలకు ఇవ్వండి." (అన్ నిసా : 5)

తరువాత ఇలా ఉపదేశించబడింది :

"అనాధలు పెళ్ళి ఈడుకు వచ్చేవరకు వారిని గమనిస్తూ ఉండండి. వారు యోగ్యులయ్యారని మీరు భావించినపుడు వారి ఆస్తిని వారికి అప్పగించండి." (అన్‌నిసా : 6)

పై ఉపదేశాల సారాంశం ఏమిటంటే అనాధ యుక్త వయస్సుకు చేరగానే, మంచీ చెడుల విచక్షణా జ్ఞానం అతనిలో పెంపొందగానే, తన ఆస్తిపాస్తులను జాగ్రత్తగా చూసుకునే తెలివితేటలు అతనిలో రాగానే అతని ఆస్తులను, సొమ్ములను సంరక్షకుడు ఉత్తమ రీతిలో అనాధకు అప్పగించాలి. దాంతో పాటు ఆ సంరక్షకుడు తన సొంత సొమ్ముల పట్ల ఎంత జాగ్రత్త వహిస్తాడో అంతే జాగ్రత్తను అనాధల సొమ్ము పట్ల కూడా వహించాలి. రుజుమార్గాన పయనించేవారు ఈ విధంగా చేయటం విధి. తద్భిన్నంగా వ్యవహరిస్తే వారు రుజుమార్గం నుండి తప్పిపోయారని భావించాలి. తప్పిపోయినవారి గమ్య స్థానం స్వర్గం కాజాలదు.

## ఏడవ నిబంధన

"కొలతలో, తూనికలో పూర్తి న్యాయంతో వ్యవహరించండ"న్నది రుజుమార్గంలో మరో నిబంధన.

కొలతలు, తూనికలలో ఖచ్చితంగా - న్యాయంగా - వ్యవహరించినపుడే వ్యాపార వాణిజ్య వ్యవహారాలలో పరస్పరం నమ్మకం కుదురుతుంది. ఈ 'నమ్మకం' ద్వారానే మార్కెట్టులో వాణిజ్యవేత్తకు పరపతి లభిస్తుంది. పరస్పర నమ్మక భావంతోనే ఆర్థిక వ్యవస్థ కుదుటపడుతుంది.

కొలతలు తూనికల్లో మనిషి తన కొరకు ఎటువంటి న్యాయాన్ని అభిలషిస్తాడో, పరుల కొరకు కూడా అటువంటి న్యాయాన్నే ఇష్టపడాలి. పుచ్చుకునేటప్పుడు పూర్తిగా పొంది, ఇచ్చేటప్పుడు తగ్గించి ఇవ్వటం జరగరాదు. కొలతలు, తూనికల్లో మోసం చేసే దురలవాటు వెనుకటి జాతుల్లో కూడా ఉండేది. ముఖ్యంగా దైవ ప్రవక్త షుఐబ్ కాలం నాటి జాతిలో ఈ దురలవాటు ఎక్కువగా ఉండేది. షుఐబ్ తన జాతి వారికి దైవ సందేశం ఇవ్వటంతోపాటు, కొలతలు తూనికల్లో మోసం చేయరాదని నిరంతరం నచ్చచెబుతుండేవారు. ఉదాహరణకు ఆ ప్రస్తావన హూద్ సూరాలో ఇలా ఉంది:

> "ఓ నా జాతి సోదరులారా! ఖచ్చితంగా, న్యాయంగా పూర్తిగా కొలవండి, తూయండి, ప్రజలకు చెందిన వస్తువుల్ని తక్కువ చేసి ఇవ్వకండి." (హూద్ : 11)

అల్ ఆరాఫ్ సూరాలోనూ ఈ ప్రస్తావన వచ్చింది :

> ("షుఐబ్ అన్నారు") తూకాన్ని, కొలతను పూర్తిగా పాటించండి, ప్రజలకు వారి వస్తువుల విషయంలో నష్టం కలిగించకండి." (85)

కాని షుఐబ్ జాతి ప్రజలు ప్రవక్త విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారు.

వ్యాపారంలో మోసంతో అక్రమ లాభాలను గడిస్తూ నిశ్చింతగా ఉండేవారు. ఎట్టకేలకు దేవుని తరపున వారిపై ఆపద అవతరించింది.

కొలతలు, తూనికలలో మోసం చేసేవారిని, దివ్య ఖుర్ఆన్ "ముతప్ఫిఫీన్" గా అభివర్ణించింది. అలాంటివారిని హెచ్చరిస్తూ దేవుడు ఒక సూరానే అవతరింపజేశాడు :

> "కొలతలు, తూనికలలో మోసం చేసేవారికి మూడుతుంది. వారి పరిస్థితి ఎటువంటిదంటే ప్రజల నుంచి పుచ్చుకునేటప్పుడు మాత్రం పూర్తిగా పుచ్చుకుంటారు. మరి వారికి తూచిగాని, కొలచిగాని ఇచ్చేటప్పుడు అందులో మోసం చేస్తారు (తగ్గించి ఇస్తారు). ఒక పెద్ద రోజున తాము తిరిగి లేపబడతామన్న సంగతి వీరికి తెలియదా? ఆనాడు ప్రజలంతా సకల లోకాల ప్రభువు ఎదుట నిలబడతారు."
>
> (తత్ఫీఫ్ : 1-6)

## 'తత్ఫీఫ్' భావం బహు విస్తృతం

'తత్ఫీఫ్' అనే అరబీ పదం కేవలం తూనికలు, వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తించదు. దాని భావం చాలా విస్తృతమయింది. అది జీవితపు అన్ని వ్యవహారాలకు వర్తిస్తుంది. ఉదాహరణకు, ఒక ఉద్యోగి తాను పని చేసే సంస్థతో ఒక ఒప్పందం చేసుకుంటాడు. కొన్ని నిర్ణీత నిబంధనలను ఒప్పుకుంటూ సంతకం చేస్తాడు. కాని ఆ ఒప్పందానికి భిన్నంగా అతను వ్యవహరిస్తే, సోమరితనం, నిర్లక్ష్యం కనబరిస్తే లేక పని వేళలను ఖాతరు చెయ్యకుండా ఇష్టానుసారం వస్తూపోతూ ఉంటే అది కూడా మోసమే అవుతుంది. అలాగే ఒక అధికారి తన చెప్పుచేతల్లో ఉన్న నౌకర్లపై - నియమాలకు విరుద్ధంగా - ఎక్కువ పని భారం మోపటం, వారి జీతభత్యాలలో కోత విధించటం వంటి చర్యలు తీసుకుంటే అదీ అన్యాయమే అవుతుంది. భార్యాభర్తలు పరస్పర హక్కులను

నెరవేర్చలేకపోతే అదీ "తత్ఫీఫ్"గానే భావించబడుతుంది. అలాగే పిల్లలు తమ తల్లిదండ్రులను, ఉద్యోగులు తమ పై అధికారులను గౌరవించకుండా తిరుగుబాటు ధోరణిని అవలంబిస్తే అది కూడా విపరీతమే అవుతుంది.

కాగా,లావాదేవీలలో, తూనికలు కొలతల్లో దగా, మోసాలకు పాల్పడటం చాలా పెద్ద నేరమని, ఈ నేరం చేసినవారు తీర్పు దినాన కఠినంగా శిక్షించబడతారని ఖుర్‌ఆన్ ద్వారా స్పష్టమవుతోంది. మనిషి తన బంధువుల, ఆప్తుల పట్ల నూటికి నూరు శాతం న్యాయం చేయలేడు. అయితే అతను సాధ్యమయినంతవరకు వారికి న్యాయం చేకూర్చే ప్రయత్నం చెయ్యాలి. తన వల్ల బంధుమిత్రుల మనసు నొచ్చుకోకుండా జాగ్రత్తపడాలి. బంధుత్వ సంబంధాల విచ్ఛిత్తికి దూరంగా ఉండాలి. తీర్పు దినాన ప్రతి మనిషీ లెక్క అతని స్థాయిని, తెలివితేటలను బట్టి తీసుకోవటం జరుగుతుంది.

## ఎనిమిదవ నిబంధన

"పలికితే న్యాయమే పలకండి, వ్యవహారం మీ బంధువులకు సంబంధించినదయినా సరే."

మానవుడు దైనందిన జీవితంలో - ఎప్పుడూ ఏదో ఒక వ్యవహారంలో - సాక్షిగా ఉండటమో, తీర్పరిగా వ్యవహరించటమో, జామీనుగా ఉండటమో పరిపాటి. అలాంటి సందర్భాలొచ్చినప్పుడల్లా అతను నికార్సుగా, నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించాలన్నది ఖుర్‌ఆన్ ఆదేశం. వ్యవహారం లేక వివాదం బంధుమిత్రులకు సంబంధించినదయినప్పటికీ పక్షపాతానికి, రాగద్వేషాలకు లోనుకాకుండా న్యాయంపై గట్టిగా నిలబడాలి. న్యాయశీలత మనిషిని ఉన్నత సోపానాలకు చేరుస్తుంది. న్యాయశీలుడయిన మనిషిని సమాజ సభ్యులంతా గౌరవిస్తారు. యదార్థానికి యావత్తు విశ్వవ్యవస్థ నిలబడి ఉన్నది సమభావం, సమతూకాల పైన్నే.

## ఉన్నత ఆదర్శం

ఖలీఫా హజ్రత్ అలీ (రజి) కాలంనాటి ఒక సంఘటనను ఇక్కడ ప్రస్తుతించటం ఎంతయినా అవసరం. ఒక కవచం (సేనాని ధరించే జాకెట్టు) గురించి హజ్రత్ అలీ మరియు ఒక యూదుని మధ్య వివాదం తలెత్తింది. వ్యవహారం కోర్టుదాకా వెళ్ళింది. హజ్రత్ అలీ ఖలీఫా అయినప్పటికీ న్యాయమూర్తి ఆదేశానుసారం న్యాయస్థానానికి వెళ్ళక తప్పలేదు. వాదోపవాదాలు జరిగాయి. కవచం తనదని వాదించిన ఖలీఫాను, సాక్షుల్ని హాజరుపరచవలసిందిగా న్యాయమూర్తి ఆజ్ఞాపించారు. ఖలీఫా తన కుమారుణ్ణి, బానిసను సాక్షులుగా హజరుపరచారు. సాక్షులిరువురూ ఖలీఫా మనుషులయినందున వారు ఖలీఫా పక్షాన మాట్లాడే అవకాశముందంటూ న్యాయమూర్తి ఆ సాక్ష్యాలను త్రోసిపుచ్చారు. ఆఖరికి తీర్పు యూదునికి అనుకూలంగా వచ్చింది. ఆ కవచం అతనికి అప్పగించబడింది. ఈ న్యాయ ప్రమాణానికి యూదుడు చలించిపోయాడు. "ఓ అలీ! నిజానికి ఈ కవచం మీదే. కాని మీ రాజ్యంలో, మీ పరిపాలనలో న్యాయం ఏ మేరకుందో తెలుసుకుందామని నేనీ వివాదానికి దిగాను, దైవ సాక్షి! విశ్వ వ్యవస్థ అంతా ఈ న్యాయం. సమతూకాల పైనే నిలిచి ఉంది" అని ఆ యూదుడు చెప్పాడు.

ఆనాటి నుంచీ అతను సత్యధర్మాన్ని విశ్వసించి అలీ (రజి) అనుయాయుల్లో కలసిపోయాడు. అందుకే న్యాయం గురించి ఇస్లామ్ మాటిమాటికీ తన అనుయాయులకు తాకీదు చేసింది.

ఉదాహరణకు :-

> "విశ్వసించిన ఓ ప్రజలారా! న్యాయం కొరకు గట్టిగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం మరియు మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు

ఎంత హాని కలిగించినా సరే." (అన్ నిసా : 135)

మరో చోట ఇలా సెలవీయబడింది :

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు స్థిరంగా ఉండే వారుగా న్యాయానికి సాక్షులుగా నిలబడండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి." (అల్ మాయిద : 8)

అంటే, ఎవరితోనయినా విరోధమో, అభిప్రాయభేదమో ఉన్నంత మాత్రాన దాన్ని ప్రాతిపదికగా చేసుకుని ఒక ముస్లిమ్ న్యాయ పరిధుల్ని అతిక్రమించటాన్ని ఇస్లామ్ సుతరామూ సహించదు. ఎట్టి పరిస్థితిలోనయినా న్యాయాన్ని విడనాడరాదన్నది ఇస్లామ్ ఆదేశం. న్యాయం చేయటం భక్తిపరాయణతకు ప్రతీక. అందుకే మనిషి, తానిచ్చే తీర్పు తన స్వయానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, తన ఆప్తులకు నష్టం కలిగించేదయినప్పటికీ వెనుకంజవేయకూడదు. ఇటువంటి - నిష్పక్షపాతమయిన న్యాయం కోసం గట్టిగా నిలబడినవారి హృదయాలు నెమ్మదిస్తాయి. కనుక న్యాయం చేయటం రుజుమార్గానికి నిదర్శనం.

## తొమ్మిదవ నిబంధన

"అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి."

అల్లాహ్, ఆత్మావస్థ (ఆలమె అర్వాహ్)లో ఆది మానవుడయిన ఆదమ్ (అలైహి) వెన్ను నుండి ఆయన సంతతిని తీసి వారిచేత ప్రమాణం చేయించాడు. "నేను మీ ప్రభువును కానా?" అని అల్లాహ్ ప్రశ్నించగా అందరూ, "అవును, నువ్వు మా ప్రభువువే" అని సమాధానమిచ్చారు. ఈ 'ప్రమాణ స్వీకారం' మానవ నైజంలో ఉంది. అంటే మానవులంతా అల్లాహ్‌ను తమ ప్రభువుగా

అంగీకరించారు. ఈ 'ప్రమాణాన్ని' మానవతకు జ్ఞాపకం చేస్తూ ఉండటానికే అల్లాహ్ తన సందేశహరులను భువి పైకి పంపుతూ వచ్చాడు. అందుకే ప్రవక్తల సందేశాన్ని ఖుర్‌ఆన్‌లో 'జిక్ర్' (హితబోధ లేక జ్ఞాపనం)గా పేర్కొనటం జరిగింది.

## మానవ నైజం వాంఛించేది

చెప్పవచ్చిందేమిటంటే దైవ భావన ప్రతి మనిషిలోనూ ఉంటుంది. ఆఖరికి దైవాన్ని బాహాటంగా నిరాకరించేవారిలో సయితం - వారి అంతరంగంలోని ఏదో ఒక మూల - ఆ అగ్ని కణం అణగారి ఉంటుంది. దాని లేకిరణాలు అప్పుడప్పుడు అతని ఆలోచనలపై ప్రసరిస్తూ ఉంటాయి. బహుశా ఈ కారణంగానే మానవుడు ఆపదలో చిక్కుకున్నప్పుడల్లా - అతనెంత పెద్ద నాస్తికుడయినప్పటికీ - అతని హృదయాంతరాళాల్లో అణగి ఉన్న దైవ భావన పైకి ఉబికివస్తుంది.

పూర్వం ఈజిప్ట్ చక్రవర్తి అయిన ఫిర్‌ఔన్ తన జాతి ప్రజలనుద్దేశించి, "నేనే అందరికంటే గొప్పవాడయిన మీ ప్రభువును (అన్ నాజియాత్ : 24)" అని ప్రకటించాడు. ఆ తరువాత మరింత గర్వాంధుడై, "నేను, నన్ను తప్ప మీ ఆరాధ్య దేవుడెవరినీ ఎరుగను (అల్ ఖసస్ : 38)" అని బుకాయించాడు. అతని అహంకారం పరాకాష్ఠకు చేరగా, "హామాన్! ఇటుకలు కాల్చి నా కోసం ఒక ఎత్తయిన కట్టడాన్ని నిర్మించు, బహుశా దానిపై ఎక్కి నేను మూసా యొక్క దేవుణ్ణి చూడగలుగుతానేమో. నేనయితే అతన్ని అసత్యవాది అని అనుకుంటున్నాను" అని చాటాడు ఫిర్‌ఔన్.

కాని దైవాగ్రహం అతనిపై విరుచుకుపడినప్పుడు, నీటిలో మునిగిపోతున్నప్పుడు అతనిలోని 'దైవ భావన' లేక 'దైవ వాగ్దానం' జాగృతమయ్యింది. ఆఖరి క్షణాల్లో దేవుని అస్తిత్వాన్ని అతను అంగీకరించాడు.

"యదార్థ దైవం ఆయన తప్ప మరొకడెవ్వడూ లేడు, ఎవరినయితే ఇస్రాయీల్ సంతతివారు విశ్వసించారో, నేను కూడా విధేయతలో శిరస్సు వంచేవారిలోని వాణ్ణే."

(యూనుస్ : 90)

అయితే ఫిర్ఔన్ సత్యస్వీకారం దైవ సమక్షంలో ఆమోద యోగ్యం కాలేకపోయింది. అతనికి సమాధానం ఇవ్వబడింది :

"ఇప్పుడు విశ్వసిస్తున్నావా! వాస్తవానికి ఇంతకు పూర్వం వరకయితే అవిధేయత చేస్తూ ఉండేవాడివి; ఇంకా కల్లోలాన్ని రేకెత్తించేవారిలో ఉన్నావు. ఇప్పుడైతే మేము కేవలం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము. నువ్వు తరువాతి తరాల వారి గుణపాఠం గుర్తుగా అయ్యేందుకు - చాలా మంది మానవులు మా సూచనల పట్ల అశ్రద్ధ వహిస్తారనేది యదార్థమయినా."

(యూనుస్ : 91, 92)

దీన్ని బట్టి అర్థమయ్యేదేమిటంటే, ప్రతి మనిషిలోనూ అతను దేవునితో చేసిన వాగ్దానం (అహదె అలస్త్) దాగి ఉంటుంది. ఒక్కడయిన దేవుడిని మాత్రమే ఆరాధించాలని అతని మనస్సాక్షి లోపలి నుంచి ప్రబోధిస్తూనే ఉంటుంది. ఈ వాగ్దానం యొక్క ఇంకొక స్వరూపం ఏమంటే, మనిషి ఏదేని విషయంలో తన తరఫున దేవుని పేర ఫలానా వస్తువు ఇస్తానని సంకల్పించుకుంటాడు. దీన్నే 'మొక్కుకోవటం' అంటారు. ఉదాహరణకు, దేవుడు ఫలానా ఆపద నుండి తనను గట్టెక్కిస్తే లేదా ఫలానా లక్ష్యం సిద్ధిస్తే దేవుని పేర 'ఇంత మంది' బీదలకు అన్నం పెడతాననో, 'ఇన్ని' రోజులు ఉపవాసం ఉంటాననో, ఒక పశువును త్యాగం చేసి అగత్యపరులకు ఇస్తాననో సంకల్పించుకోవటం. షరీఅత్ స్ఫూర్తికి అనుగుణంగా ఉండే ఇలాంటివన్నీ

ఇస్లామ్‌లో 'నజర్' (మొక్కుబడి) అనబడతాయి. ఇటువంటి మొక్కుబడి సయితం 'ఆరాధనే' గనక, ఆరాధనలో దైవేతరులకు చోటు కల్పించటం అధర్మం గనక కేవలం ఒక్క అల్లాహ్‌నే మొక్కుకోవాలి. అల్లాహ్ తప్ప, మరే సజీవాన్నీ, నిర్జీవాన్నీ మొక్కుకోవటంగాని, మొక్కుబడులు చెల్లించటంగాని చేయరాదు. ఫాతిహ సూరాలో దాసుడు, "మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయాన్నే అర్థిస్తున్నాము" అని తన ప్రభువునుద్దేశ్యించి పలుకుతాడు. ఇదీ 'ఒప్పందం'లోని భాగమే. అందుకే అల్లాహ్ ఏమంటున్నాడంటే,

"మీరు నన్ను జ్ఞాపకం చెయ్యండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం చేస్తాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. కృతఘ్నతకు పాల్పడకండి."

(అల్ బఖర : 152)

నిజానికి షరీఅత్ అంతా 'దైవంతో ఒప్పందం' వంటిదే - దాసుడైన మనిషి తన ఆరాధ్య దైవంతోనే గాక సాటి మనుషులతోనూ ఎన్నో ఒప్పందాలు కుదుర్చుకుంటాడు. వాటి నియమాలకు కట్టుబడి ఉంటాడు. దైనందిన జీవితంలో ఇది పరిపాటే. అందుకే దేవుడు - దాసులు, మరియు దాసుల మధ్య జరిగే ఒప్పందాల (Agreements) లన్నింటికీ కట్టుబడి ఉండాలని దైవ గ్రంథమయిన ఖుర్‌ఆన్ నొక్కి చెప్పింది. ఉదాహరణకు ఖుర్‌ఆన్‌లో అల్ మాయిద పేరుతో ఒక సూర ఉంది. ఈ సూర ప్రారంభమే "విశ్వసించిన ప్రజలారా! కట్టుబాట్లను పూర్తిగా పాటించండి" అంటూ జరిగింది. ఒక స్త్రీ మరియు ఒక పురుషుడికి భార్యాభర్తల స్థాయిని కల్పించే నికాహ్ ఒప్పందం దీనికొక మచ్చు తునక. ఇదే విధంగా నిత్య జీవితంలో ప్రజలు పరస్పరం ఎన్నో వ్యవహారాలపై ఒప్పందాలు చేసుకుంటారు.

## సారాంశం

తేలిందేమంటే, రుజుమార్గాన నడవటానికి ఒప్పందాలకు కట్టుబడి

ఉండటం ఎంతయినా అవసరం. దేవుని ఏకత్వంపై విశ్వాసం మొదలుకుని జీవన వ్యవహారాలు, నీతినడవడికలు, వాణిజ్య వ్యవహారాలు, న్యాయ శాసనాలు, సాక్ష్యాల వరకు - అన్నీ వెనుకటి పంక్తులలోని 9 ఆదేశాలలో ప్రస్తుతించబడ్డాయి. మరో విధంగా చెప్పాలంటే హుఖూఖుల్లాహ్ (దేవుని హక్కులు) మరియు హుఖూఖుల్ ఇబాద్ (దాసుల హక్కుల) సారాంశం ఈ ఆదేశాలలో వచ్చేసింది. ఆ తొమ్మిది ఆదేశాలపై ఎంత ఎక్కువ ఆత్మావలోకనం చేసుకుంటే అంత మంచిది.

1. అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ చేయరాదు.
2. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా మెలగాలి.
3. దారిద్ర్యం లేక లేమికి భయపడి సంతానాన్ని హత్య చేయరాదు.
4. సిగ్గుమాలిన పనులకు దూరంగా ఉండాలి.
5. ఏ ప్రాణినీ అన్యాయంగా హతమార్చరాదు.
6. అనాథల సొమ్మును అధర్మంగా కాజేయరాదు.
7. కొలతలు, తూనికల్లో తగ్గించి ఇవ్వరాదు.
8. న్యాయం కోసం గట్టిగా నిలబడాలి.
9. దైవ వాగ్దానాన్ని నెరవేర్చాలి.

◆ ◆ సమాప్తం ◆ ◆

# SIRAT-E-MOSTAQEEM

(Telugu)

## أهداف المكاتب التعاونية للدعوة والإرشاد:

١ - دعوة غير المسلمين للإسلام بطرق تقربة من قلوبهم ( بلغات مختلفة ) .

٢ - إعطاء الصورة الصحية عن الإسلام كمنهج متكامل للحياة .

٣ - احتضان المسلمين الجدد وتعليم مبادىء الدين

٤ - توعية المسلمين الأصلين والوافدين بجنسياتهم ولغاتهم المختلفة .

المكتب التعاوني للدعوة والإرشاد
بالمدينة الصناعية - جدة
هاتف وفاكس : ٦٣٦٩٥٤٩ ص.ب : ٣٢٦٢٨ جدة ٢١٤٣٨
فرع المندوبية كيلو 14
تليفون / فاكس : ٦٢٤١٦٧٧

*COOP. OFFICE FOR CALL & GUIDANCE*
INDUSTRIAL CITY. JEDDAH.
PHONE / FAX : 6369549
P.O.BOX : 32628 JEDDAH : 21438

*BRANCH : AL-MANDUBIA KILO 14*
TEL / FAX : 6241677

# الصراط المستقيم

# ఋజుమార్గం

మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్

٩

يوزع مجاناً ولا يباع